# నేటి నిజం

తెలుగు దినపత్రిక

E-mail : netinijam93@gmail.com

website:www.netinijam.com

హైదరాబాద్ | శనివారం 5-11-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :29 | సంచిక: 71 | పేజీలు:6 | వెల: రూ.1/-


## భూమిపై కూలనున్న చైనా రాకెట్.. స్పెయిన్‌లో విమానాశ్రయాలు మూసివేత

న్యూఢిల్లీ, నవంబర్ 4: చైనా ఇటీవల లాంచ్ చేసిన భారీ రాకెట్ శిథిలాలు నియంత్రణ కోల్పోయాయి. వేగంగా దూసుకొస్తున్న అవి భూమిపై కూలనున్నాయి. ఈ నేపథ్యంలో స్పెయిన్‌లోని పలు విమానాశ్రయాలను మూసివేశారు. చైనా అభివృద్ధి చేసిన అత్యంత శక్తివంతమైన రాకెట్, లాంగ్ మార్చ్ 5బీ (సీజెడ్–5బీ) అక్టోబర్ 31న నింగిలోకి దూసుకెళ్లింది. అంతరిక్షంలో చైనా నిర్మిస్తున్న స్పేస్ స్టేషన్‌కు 20 టన్నుల బరువున్న మెంగ్టియన్ లాబొరేటరీ క్యాబిన్ మాడ్యూల్‌ను దీని ద్వారా పంపారు.

కాగా, ఈ భారీ రాకెట్ శిథిలాలు భూమిపైకి వేగంగా దూసుకొస్తున్నాయి. కొన్ని భాగాలు శుక్రవారం, మరి కొన్ని భాగాలు శనివారం భూమిపై పడవచ్చని తెలుస్తున్నది. ఈ శిథిలాలు చాలా వరకు అట్లాంటిక్ మహా సముద్రంలో కూలవచ్చని యూరోపియన్ యూనియన్ స్పేస్ సర్వైలెన్స్ అండ్ ట్రాకింగ్ సర్వీస్ అంచనా వేసింది. అయితే ఉత్తర స్పెయిన్, పోర్చుగల్, దక్షిణ ఇటలీలో కూడా రాకెట్ శిథిలాలు కూలే ముప్పు ఉందని హెచ్చరించింది. మరోవైపు చైనా రాకెట్ శిథిలాల ముప్పు భయంతో స్పెయిన్‌లోని పలు విమానాశ్రయాలను శుక్రవారం మూసివేశారు.

## ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల షెడ్యూల్ విడుదల..

న్యూఢిల్లీ, నవంబర్ 4:దేశ రాజధాని ఢిల్లీలో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలయ్యింది. ఢిల్లీ స్టేట్ ఎలక్షన్ కమిషనర్ విజయ్ దేవ్ ఈ సాయంత్రం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు.

ఆ షెడ్యూల్ ప్రకారం.. డిసెంబర్ 4న ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల పోలింగ్ జరగనుంది. డిసెంబర్ 7న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు.

ఈ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 7న నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. 14న నామినేషన్‌ల గడువు ముగియనుంది. అభ్యర్థులు తమ నామినేషన్‌లను ఉపసంహరించుకోవడానికి ఈ నెల 19 ఆఖరి తేదీగా నిర్ణయించారు. కాగా, ఎన్నికల షెడ్యూల్ విడుదల నేపథ్యంలో ఇవాళ్టి నుంచే ఢిల్లీలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని విజయ్ దేవ్ పేర్కొన్నారు.

ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మొత్తం 68 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉన్నదని ఎన్నికల కమిషనర్ విజయ్ దేవ్ చెప్పారు. మొత్తం 250 వార్డులకు ఎన్నికలు జరుగుతాయని, అందులో 42 వార్డులు ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలని ఆయన తెలిపారు.

## అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష



ఖమ్మం, నవంబర్ 4: (నేటినిజం ప్రతినిధి): మన ఊరు–మన బడి కార్యక్రమం క్రింద చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని ప్రజ్ఞ సమావేశ మందిరంలో అధికారులతో పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 426 పాఠశాలల్లో మన ఊరు–మన బడి కార్యక్రమం క్రింద అభివృద్ధి పనులు చేపట్టినట్లు, 416 పాఠశాలల్లో పనులు గ్రౌండింగ్ అయినట్లు తెలిపారు. ఇందులో 372 పాఠశాలల్లో ఉపాధిహామీ క్రింద పనులు జరుగుతున్నట్లు తెలిపారు. గుర్తించిన 63 పాఠశాలల్లో పెయింటింగ్ పనులు చేపట్టినట్లు ఆయన అన్నారు. పెయింటింగ్ కు సిద్ధంగా ఉన్న పాఠశాలల్లో పనులు చేపట్టి పూర్తి చేయాలన్నారు. ఇంకనూ 10 పాఠశాలల్లో పనులు ప్రారంభం కానట్లు, వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. పూర్తి అయిన పనులకు వెంట వెంటనే ఎంబిలు సమర్పించాలన్నారు. నవంబర్ 15 కల్లా పూర్తయిన పనుల బిల్లులు సమర్పించాలన్నారు. పనులు పూర్తయిన పాఠశాలలకు ఈ నెల నుండి డ్యూయల్ డెస్క్ ల పంపిణీ ప్రారంభం కానున్నట్లు ఆయన తెలిపారు. 12 పాఠశాలల్లో 27 అదనపు తరగతి గదుల నిర్మాణానికి రివైజ్డ్ ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. గిరిజన సంక్షేమం, రోడ్లు భవనాల ఇంజనీరింగ్ శాఖలు చేపట్టిన పనుల్లో వేగం పెంచాలన్నారు. పనుల పూర్తికి అధికారులు రోజువారీ సమీక్ష చేయాలని, వ్యక్తిగత శ్రద్ధ తో త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని అన్నారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ స్నేహాలత మొగిలి, జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య, ఇఇలు నాగశేషు, శ్యామ్ ప్రసాద్, శ్రీనివాసరావు, చంద్రమౌళి, కృష్ణ లాల్, మండల విద్యాధికారులు, ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ, డిఇ లు తదితరులు పాల్గొన్నారు.

## ఎనర్జీ టెర్రరిజానికి పాల్పడుతున్న రష్యా: జెలెన్‌స్కీ

న్యూఢిల్లీ, నవంబర్ 4: రష్యా ఎనర్జీ టెర్రరిజానికి పాల్పడుతున్నట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. ఎనర్జీ నెట్వర్క్‌ను అటాక్ చేయడం వల్ల ఉక్రెయిన్‌లో దాదాపు 45 లక్షల మంది అంధకారంలోకి ఉండిపోయినట్లు జెలెన్‌స్కీ తెలిపారు. ఉక్రెయిన్‌లోని విద్యుత్తు కేంద్రాలపై మిస్సైళ్లు, డ్రోన్లతో రష్యా దాడి చేసిన విషయం తెలిసిందే. మరోవైపు ఖేర్సన్ సిటీ నుంచి రష్యా తన దళాలను ఉపసంహరిస్తున్నట్లు తెలుస్తోంది.

గడిచిన నెల రోజుల్లోనే దేశంలోని మూడవ వంత పవర్ స్టేషన్లను రష్యా ధ్వంసం చేసింది. ఈ విషయాన్ని జెలెన్‌స్కీ వెల్లడించారు. విద్యుత్తు కేంద్రాలను టార్గెట్ చేయడం వల్ల .. ఆచితూచి విద్యుత్తును వాడాలని ఉక్రెయిన్ ప్రభుత్వం ప్రజల్ని కోరింది. ఫ్రంట్‌లైన్‌లో రష్యా దళాలు ముందుకు కదలలేకపోతున్నాయని, అందుకే ఆ దళాలు ఎనర్జీ కేంద్రాలను టార్గెట్ చేస్తున్నాయని జెలెన్‌స్కీ ఆరోపించారు. ఎనర్జీ టెర్రరిజానికి పాల్పడుతున్న రష్యా .. అది ఆ దేశ బలహీనతను చూపిస్తోందని అన్నారు.

యుద్ధ క్షేత్రంలో ఉక్రెయిన్‌ను రష్యా ఓడించలేదని, అందుకే మన ప్రజల్ని ఇలా ఇబ్బందులు పెడుతున్నారని జెలెన్‌స్కీ అన్నారు.

### చరిత్రలో నేటినిజం



కం॥ ట్రోఫీలను గెలుచు కొనుచు
నా ఫరులను గాను చు క్రికెట టాట ను - ఘనమౌ
ఈ ఫీల్డు పై నిలుపుచు - కే
రా ఫ్రభుసుగా నిలచె విరాట కోహ్లీ వెసన్ !!

(నవంబర్ 5 విరాట్ కోహ్లీ జననం..)

–రాధశ్రీ

సెల్:9494481210



నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

## ప్రధాని పర్యటనకు ఏర్పాట్లు చేయండి.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్



హైదరాబాద్, నవంబర్ 4:రామగుండం ఎరువుల కర్మాగారం జాతికి అంకితం చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 12న రామగుండం వస్తున్నారని, దీనికి కావాల్సిన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ ఆదేశించారు.

శుక్రవారం హైదరాబాదులోని బీఆర్కే భవన్లో పెద్దపల్లి జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని పర్యటన నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు.

ఈ సమావేశంలో పరిశ్రమల కార్యదర్శి జయేష్ రంజన్, రాష్ట్ర డిజిపి మహేందర్ రెడ్డి, అడిషనల్ డీజీ శివధర్, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ సంగీత సత్యనారాయణ, రామగుండం సిపి చంద్రశేఖర్ రెడ్డి, డిసిపి రూపేష్, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, దీపక్ కుమార్, ఆర్ ఎఫ్ సి ఎల్ సి ఓ అలోక్ సింగాల్, మాజీ సీఈవో అతుల్ జైన్ లతోపాటు పలువురు పాల్గొన్నారు.

## తమిళనాడులో కుండపోత వర్షాలు.. మరో రెండు రోజులు స్కూళ్లు, కాలేజీలకు సెలవు



చెన్నై, నవంబర్ 4: తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పుదుచ్చేరి రాష్ట్రం అంతటా, తమిళనాడులో రాజధాని చెన్నైతోపాటు దాని పరిసరాల్లో 22 జిల్లాల్లో వరుణుడు బీభత్సం సృష్టిస్తున్నాడు. దాంతో రెండు రాష్ట్రాల్లో శుక్ర, శనివారాల్లో కూడా కాలేజీలు, స్కూళ్లకు సెలవు ప్రకటించారు.

తమిళనాడులో వచ్చే ఆదివారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని చెన్నైలోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు చెన్నై సహా 22 జిల్లాలను అప్రమత్తం చేసింది. చెంగల్‌పేట్, శోలింగనల్లూర్, కేలంబాక్కమ్ నగరాల్లో 4 సెంటీమీటర్ల చొప్పున, అన్నా యూనివర్సిటీ, తంబారమ్ నగరాల్లో 3 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదు కాగా.. మామల్ల పురంలో అత్యధికంగా 9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది.

కాగా, ఇవాళ నీలగిరి, కోయంబత్తూర్, తిరుప్పూర్, దిండిగుల్, థేని జిల్లాలతోపాటు, రాజధాని చెన్నైలోని తొండియార్‌పేట్, వేలచేరి, వండల్లూర్, వలజాబాద్, నెమిలి, అరక్కోనమ్ ఏరియాల్లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

## దళిత కుటుంబాల్లో వెలుగులు నింపేందుకే దళిత బంధు: ప్రభుత్వ విప్ గాంధీ




హైదరాబాద్, నవంబర్ 4: దళితుల నిజమైన ఆత్మబంధువుగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని, ముఖ్యంగా దళితుల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు దళిత బంధును అమలు చేస్తున్నారని ప్రభుత్వ విప్ గాంధీ అన్నారు. నగరంలోని హాఫీజ్‌పేట్ డివిజన్ అంబేద్కర్‌నగర్‌కు చెందిన దళితుడు యాదగిరికి మంజూరైన స్విఫ్ట్‌కారును కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత బంధును మరింత విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.

ప్రభుత్వ పథకాలు పొందుతున్న లబ్ధిదారులు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. తొలివిడతగా నియోజకవర్గంలో వంద మంది దళితులకు దళిత బంధును అందిస్తున్నట్లు వెల్లడించారు. దళిత బంధు పథకం వల్ల ఎంతోమంది పేదలు యజమానులయ్యారని పేర్కొన్నారు. టీఆర్ఎస్ నాయకులు గౌతం గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, రఘునాథ్, కృష్ణ, నాగరాజు, గోపాల్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటింటికీ ప్రభుత్వ పథకాలు : ఎమ్మెల్యే జి.సాయన్న



హైదరాబాద్, నవంబర్ 4: తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఇంటింటికీ సంక్షేమ కార్యక్రమాలను అందిస్తుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి.సాయన్న పేర్కొన్నారు.

శుక్రవారం నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు.

ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలను ఆదుకునేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తుందని తెలిపారు.

ఏ రాష్ట్రంలో లేని విధంగా దళితబంధు, రైతు బీమా, చేనేత బీమా, ఆసరా పింఛన్ అందిస్తున్న ఘనతతో టీఆర్ఎస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్త పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, నళిని కిరణ్, టీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మునుగోడు ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు.. 15 రౌండ్లలో పూర్తి

నల్గొండ, నవంబర్ 3:మునుగోడు ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. నవంబర్ 6వ తేదీన ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. నల్లగొండ పట్టణంలోని అర్జాలబావిలోని వేర్ హౌసింగ్ గోడౌన్‌లో కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

### 21 టేబుల్స్.. 15 రౌండ్లు..

ఓట్ల లెక్కింపునకు 21 టేబుల్స్ ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్‌కు సూపర్‌వైజర్, అసిస్టెంట్ సూపర్ వైజర్, మైక్రో అబ్జర్వర్ లను నియమించారు. 15 రౌండ్లలో కౌంటింగ్ పూర్తి కానుంది. ఒక్కో రౌండ్‌లో 21 పోలింగ్ స్టేషన్లలో నమోదైన ఓట్లను లెక్కించనున్నారు. మొత్తంగా 298 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది.

### ఉదయం 9 గంటలకు తొలి రౌండ్ ఫలితం

మునుగోడులో 686 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తి అయిన తర్వాత ఈవీఎంలలో నమోదైన ఓట్లను లెక్కించనున్నారు. తొలి రౌండ్ ఫలితం ఉదయం 9 గంటలకు విడుదల కానుంది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు పూర్తి స్థాయి ఫలితం వెలువడనుంది.

### మొదటగా చౌటుప్పల్ మండలం ఓట్ల లెక్కింపు

మునుగోడు ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపులో భాగంగా.. మొదటగా చౌటుప్పల్ మండల పరిధిలో నమోదైన ఓట్లు లెక్కిస్తారు. ఆ తర్వాత నారాయణ పురం, మునుగోడు, చండూర్, మర్రిగూడం, నాంపల్లి, గట్టుప్పల్ మండలాల ఓట్లను వరుసగా లెక్చించనున్నారు.

### కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత

కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద సీఆర్పీఎఫ్ బలగాలతో, సీసీ కెమెరా ల పర్యవేక్షణ లో 24 గంటల పాటు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

## శరవేగంగా పాలకుర్తి దేవాలయం నిర్మాణ పనులు : మంత్రి ఎర్రబెల్లి



జనగామ, నవంబర్ 4: జనగామ జిల్లా పాలకుర్తిలోని స్వయంభు శ్రీ చండిక సమేత సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. కార్మిక మాస ఉత్సవాల సందర్భంగా ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్న అఖండ దీపోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం హన్మకొండలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంత్రి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా దీపోత్సవంలో పాల్గొనాలని ఆలయ నిర్వాహకులు మంత్రిని ఆహ్వానించారు. ప్రతి సంవత్సరం కార్తికమాసంలో జరిగే అఖండ దీపోత్సవం వైభవంగా నిర్వహించడం జరుగుతుందని , ఆలయ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వీరమనేని యాకంత రావు, పురోహిత జేఏసీ సంఘం అధ్యక్షుడు డీవీ ఆర్ శర్మ, ఆలయ పర్యవేక్షకులు కొత్తపెల్లి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.




# మనం కూర్చున్న కొమ్మను మనమే నరుక్కుందామా?!

## (6-18 నవంబర్ 2022 ఈజిప్ట్‌లో నిర్వహించ తలపెట్టిన సిఓపి-27 సదస్సు నేపథ్యంలో)

06 నవంబర్‌న 'ప్రపంచ వాతావరణ న్యాయ దినం (వరల్డ్ డే ఫర్ క్లైమేట్ జస్టిస్)' సందర్భంగా 2022 నవంబర్ 6-18 మధ్య ఈజిప్షియన్ సిటీ 'శార్మ్ ఎల్-షేక్' వేదికగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన 27వ కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (సిఓపి-27)లో 200 దేశాలకు చెందిన 30,000లకు పైగా ప్రతినిధులు వాతావరణ ప్రతికూల మార్పులను విశ్లేషించడం, రానున్న ప్రమాదాలను పసిగట్టడం, సానుకూల మార్పుల దిశగా అడుగులు వేయడం లాంటి పలు పర్యావరణ పరిరక్షణకు అంశాలను చర్చించే లక్ష్యాలను తలపెట్టింది. నేడు దెబ్బ మీద దెబ్బలా కోవిడ్-19 కోరలు చాచడం, ఉక్రెయిన్ - రష్యా యుద్ధం కొనసాగడం లాంటి విపత్తులతో ప్రపంచ దేశాలు పెరుగుతున్న ద్రవ్యోల్బణం, శక్తి సంక్షోభం, ఆహార కొరత, సరుకుల సరఫరా శృంఖలం గాడి తప్పడం, ముడి చమురు ధరలు చుక్కల్లోకి చేరడం, వాతావరణ మార్పులు పరిధిని దాటి మానవాళినే కాకుండా సమస్త జీవరాసులను ప్రభావితం చేయడం, కార్బన్ ఉద్గారాలు పెరగడం, జీవవైవిధ్యం దెబ్బతినడం, ఆహార/శక్తి అభద్రత వంటి ప్రతికూలతలను అనుభవిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల విపత్తుల ఫలితంగా వివిధ ప్రాంతాల్లో ఏకకాలంలో తీవ్ర వడగాలులు, వరదలు, తుఫాన్లు, కరువుకాటకాలు, కార్చిచ్చులు లాంటివి సర్వసాధారణం అయ్యాయి. ఈ సహజ, మానవ కల్పిత సంక్షోభాల నడుమ జరుగనున్న సిఓపి-27 అంతర్జాతీయ సదస్సుపై పర్యావరణ ప్రేమికులు, బాధ్యతగల పౌరులు, విద్యాధికులు, నిపుణులు గంపెడు ఆశలను పెట్టుకొని ఎదురుచూస్తున్నారు.

కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్(సిఓపి) చరిత్ర :

గత మూడు దశాబ్దాలుగా నిర్వహిస్తున్న సిఓపి సదస్సులు "యూయన్ ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ (యూయన్‌యఫ్‌సిసిసి)" ద్వారా 198 దేశాలకు దిశ నిర్దేశనం చేస్తూ వాతావరణ ప్రతికూల మార్పుల కట్టడి చర్యలను సభ్య దేశాలకు సూచిస్తున్నది. 1995లో జరిగిన తొలి సిఓపి-1 సదస్సు బెర్లిన్ నగరంలో జరుగగా, 1997లో సిఓపి-3 ద్వారా 'క్యోటో ప్రోటోకాల్', 2015లో సిఓపి-21 వేదికగా 'ప్యారిస్ అగ్రిమెంట్' తీసుకోవడం జరిగింది. ఈ కార్యాచరణ ద్వారా భూతాపం 2 డిగ్రీల లోపు అదుపు చేయడమనే లక్ష్యంతో పాటు గత ఏడాది నిర్వహించిన గ్లాస్గో సిఓపి-26 సదస్సులో శిలాజ ఇంధన వినియోగాన్ని క్రమంగా తగ్గించడానికి తీర్మానాలు చేయడం మనకు విధితమే.

ఈజిప్ట్‌లో నిర్వహించనున్న సిఓపి-27 లక్ష్యాలు:

గత ఏడాదిగా ప్రపంచవ్యాప్తంగా వాతావరణ ప్రకోపాలు మానవాళితో పాటు సమస్త జీవకోటి మనుగడకు విఘాతంగా నిలుస్తున్నాయి. పాకిస్థాన్/దక్షిణాఫ్రికా/నైజీరియాల్లో తీవ్ర వరదలు, ఆర్కిటిక్/యూరోపుల్లో తీవ్ర వడగాలులు, ఫ్రాన్స్/పశ్చిమ అమెరికాల్లో అతి కరువు, ఆస్ట్రేలియన్ అడవులు అగ్నికి ఆహుతి కావడం లాంటివి రాజ్యమేలాయి. అభివృద్ధి చెందిన ధనిక దేశాలు విడుదల చేస్తున్న అధిక కార్బన్ డై ఆక్సైడ్ కారణంగా భూతాపంతో పాటు వాతావరణ ప్రతికూలతలతో పేద దేశాలు కూడా మూల్యం చెల్లించాల్సి వస్తున్నది. కార్బన్ ఉద్గారకాలను తగ్గించడం, సంప్రదాయ తరిగే శిలాజ ఇంధనాల వినియోగాన్ని క్రమంగా కట్టడి చేయడం, పునరుత్రాదక సంప్రదాయేతర తరగని ఇంధనాల ఉత్పత్తి/వాడకాలను ప్రోత్సహించడం, భూతాపాన్ని అదుపు చేసే చర్యలు తీసుకోవడం, వాతావరణ మార్పులను నియంత్రించడానికి కావలసిన నిధులను అల్పాదాయ దేశాలకు సమకూర్చుకోవడం, సానుకూల మార్పుల దిశగా పలు నియమనిబంధనలను నిర్ధేషించడం, పర్యావరణహిత పద్ధతులను ప్రచారం చేయడం లాంటి అంశాలను సిఓపీ-27 చర్చించనుంది. వాతావరణ మార్పుల నియంత్రణకు పేద దేశాలకు ఆర్థిక వెసులుబాటు కల్పించే మార్గాలను వేదిక విశ్లేషించనుంది.

గ్లాస్గో సిఓపీ-26 నుంచి 'శార్మ్ ఎల్-షేక్' (ఈజిప్ట్) సిఓపీ-27 సదస్సు వరకు:

గత ఏడాది గ్లాస్గో నగరంలో నిర్వహించిన సిఓపీ-26 తరువాత ప్రపంచవ్యాప్తంగా అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. మానవ ప్రమేయ పర్యావరణ విధ్వంసంతో వాతావరణ ప్రతికూలతలు దినదినం పెరగడం, నిర్ధేషించుకున్న ప్రణాళికలు విఫలం కావడం గమనించాం. దేశాలు తీసుకొంటున్న వాతావరణ సానుకూల చర్యలు అతి స్వల్పంగా ఉన్నాయని, పారిస్ ఒప్పందం ప్రకారం ఉష్ణోగ్రతల పెరుగుదల 1.5 డిగ్రీ సెల్సియస్ లోపు ఉండేలా చూడడం, హరిత గృహ వాయువులను (గ్రీన్ హౌజ్ గ్యాసెస్) నియంత్రించడం సంతృప్తికరంగా జరగడం లేదని అర్థం అవుతున్నది. వాతావరణ ఉష్ణోగ్రతలు 1.2 డిగ్రీల వరకు పెరగడంతోనే ప్రపంచవ్యాప్తంగా వరదలు, తుఫాన్లు, వడగాలులను మానవాళి అనుభవిస్తున్నది. ప్రపంచ దేశాలు సిఓపీ నిర్ణయాలను పెడచెవిన పెడితే ఉష్ణోగ్రతలు 2.5 డిగ్రీల వరకు చేరి మానవాళితో పాటు ప్రాణికోటి మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరికలు చేస్తున్నారు. 2010లో ఉద్గారాలతో పోల్చితే 2030 నాటికి ప్యారిస్ ఒప్పందానికి లోబడి 45 శాతం వరకు ఉద్గారకాలను తగ్గించాలనే లక్ష్యాలను పెట్టుకోవడం జరిగింది. గ్రీన్‌హౌజ్ వాయువులను అత్యధికంగా విడుదల చేస్తున్న చైనా,యూయస్‌ల మధ్య ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణం నెలకొని ఉంది. ఈ రెండు దేశాలు తమ తమ ఖచ్చితమైన కార్యాచరణను అమలు పరడానికి ఏకతాటి మీదికి రావడం కొంత కష్టంగానే తోస్తున్నది. సిఓపీ-27 లక్ష్యాలు అధిగమించడానికి చైనా, అమెరికా ముందుకు రావడం మాత్రమే సత్ఫలితాలను ఇస్తాయని నమ్మాలి. సిఓపి-27 సదస్సుకు హాజరవుతున్న 200 దేశాల్లో చిలీ, మెక్సికో, టర్కీ లాంటి 24 దేశాలు మాత్రమే తమ తమ ఉద్గార కట్టడి ప్రణాళికలకు సంబంధించిన సవివర పత్రాలను సమర్పించడం జరిగింది. అభివృద్ధి పేరుతో పర్యావరణ విచ్చిన్నానికి ప్రధాన కారణం అవుతున్న ధనిక దేశాలు ప్రేక్షక పాత్ర వహిస్తే సిఓపీ-27 సదస్సు పేలవంగా ముగుస్తుందనడంలో అతిశయోక్తి లేదు. అభివృద్ధి చెందిన అగ్రదేశాలు తమ తమ కట్టడి చర్యలను అమలు పరుస్తూనే, పేద దేశాల్లో వాతావరణ మార్పుల అదుపుకు సంబంధించిన కార్యాచరణ అమలుకు కావలసిన ఆర్థిక చేయూత కూడా ఇవ్వాల్సిన బాధ్యతను తమ భుజస్కాందాల మీద వేసుకోవాలి.

ఐపిసిసి నివేదిక వివరాలు:

"ఇంటర్‌గవర్నమెంటల్ పానెల్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ (ఐపిసిసి)" నివేదిక ప్రకారం నేటి వాతావరణ ప్రతికూల మార్పుల ఫలితంగా పర్యావరణ వ్యవస్థకు తీవ్రమైన హాని కలుగుతున్నదని విదితం అవుతున్నది. ఈ ప్రతికూల వాతావరణ పరిస్థితులతో ఆహార సరఫరా, మానవ ఆరోగ్యం, జీవవైవిధ్యాలు ప్రభావితం అవుతున్నాయంటూనే కార్బన్ ఉద్గారాలను తగ్గించడమే ఉత్తమ మార్గమని తేల్చింది. ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీల వరకు పెరిగిన దుస్థితిలో 14 శాతం వరకు ప్రాణ జాతులు అంతరించనున్నాయని తేలింది. బొగ్గు ఆధార పరిశ్రమలను మూసి వేయాలని, ఈ విషయంలో ప్రపంచ బొగ్గు వినియోగంలో 10 శాతం ఉన్న భారత్ సత్వరమే తగు చొరవ తీసుకోవల్సి ఉందని తెలుస్తున్నది.

వాతావరణ మార్పుల దిశగా ఇండియా:

జనాభా విస్ఫోటనం, పేదరికం, అవిద్య, అధిక వాహన వినియోగం, పరిశ్రమలు, మానవ ప్రేరేపిత చర్యలు లాంటి పలు కారణాలతో ఇండియాలో భూతాపంతో పాటు వాతావరణ ప్రతికూల మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వాతావరణ ప్రతికూల మార్పులను నిలువరించడానికి శిలాజ ఇంధన వినియోగాన్ని, కార్బన్ ఉద్గారాలను కట్టడి చేసే ప్రయత్నాలు చేస్తున్నది. గత సిఓపీ-26 సదస్సులో పాల్గొన్న భారత ప్రధాని తమ కార్యాచరణను ప్రకటించడం మనకు తెలుసు. పునరుత్పాదక శక్తి ఉత్పత్తి, వాడకం పెంచడంలో భారత ప్రభుత్వం పలు చర్యలను తీసుకోవడంలో కొంత సఫలతను సాధించింది. 'పంచమిత్ర' పథక రూపకల్పన ద్వారా 2030 నాటికి 50 శాతం వరకు శిలాజ ఇంధనాలను తగ్గిస్తూనే తరగని ఇంధన శక్తిని 500 జిడ్ల్యూ వరకు పెంచడం, 2030 వరకు కార్బన్ ఉద్గారకాలను 45 శాతం తగ్గించడం, 2030 నాటికి ఒక బిలియన్ టన్నుల ఉద్గారకాలను తగ్గించడానికి ప్రయత్నిస్తూనే 2070 నాటికి జీరో ఉద్గారాల స్థాయికి చేరడానికి పథక రచనలు చేస్తున్నది. సౌర విద్యుత్తు ఉత్పత్తితో పాటు యుూకెతో కలిసిన 'ఒకే సూర్యుడు-ఒకే భూప్రపంచం-ఒకే గ్రిడ్' అనే పథకాన్ని ఇండియా ప్రవేశపెట్టడం జరిగింది. 'నేషనల్ ఆక్షన్ ప్లాన్ ఆన్ క్లైమేట్ ఛేంజ్' వేదికగా భారత ప్రభుత్వం 8 ప్రధాన జాతీయ మిషన్లను ఏర్పాటు చేసి వాతావరణ మార్పుల దిశగా వడివడిగా చర్యలు చేపడుతున్నది.

ప్రపంచ దేశాలన్నీ చేయి చేయి కలిపి కఠిన చర్యలను సమాంతరంగా చేపడితేనే వాతావరణ విపత్తుల నుంచి జీవకోటికి ఉపశమనం లభిస్తుందని తెలుసుకుందాం. మన నివాస గృహం ధరణి అని తెలుసుకొని మన ఇంటిని మనమే కాపాడుకుందాం, రేపటి తరాలకు ఆహ్లాదకర పర్యావరణాన్ని బహుమతిగా అందిద్దాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మళ్లీ షోకాజ్ నోటీసు..

న్యూఢిల్లీ, నవంబర్ 4:తెలంగాణ కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ సంఘం శుక్రవారం నాడు మరోసారి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 7వ తేదీలోపుగా సమాధానం ఇవ్వాలని ఆ నోటీసులో కోరింది. మునుగోడులో ఉప ఎన్నిక నేపథ్యంలో బీజేపీ అభ్యర్థి, తన తమ్ముడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఓటేయాలని వెంకట్ రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలను కోరినట్లు సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్ అయింది. దీనిపై స్పందించిన కాంగ్రెస్ అధిష్టానం గతనెల 22న షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

ఆ సమయంలో ఆస్ట్రేలియా పర్యటనలో ఉండడంతో తనకు నోటీస్ అందలేదని పార్టీ కార్యవర్గం తెలిపింది. తాజాగా హైదరాబాద్ తిరిగి రావడంతో కాంగ్రెస్ పార్టీ మరో సారి నోటీసులు జారీ చేసింది. ఇప్పుడైనా నోటీసుకు స్పందిస్తారో లేదో వేచిచూడాల్సిందే.




# మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి : మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్, నవంబర్ 4 (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ఆవిర్భావానికి ముందు రాష్ట్రంలో వర్షాలు పడితే గాని చెరువులు నిండని పరిస్థితులు ఉండేవని, ప్రస్తుతం మండుటెండలో సైతం చెరువులు మత్తడులు దూకడంతో మత్స్య కారులకు న్యాయం జరిగిందని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖా మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం ఎల్ఎండీ జలాశయంలోని గంగమ్మ దేవాలయం వద్ద మత్స్య శాఖా ఆధ్వర్యంలో 100 శాతం ఉచితంగా 3 లక్షల రొయ్య పిల్లలను నగర మేయర్, జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి విడుదల చేశారు. అనంతరం పత్రికా విలేకరులతో మాట్లాడుతూ..



తెలంగాణ ఆవిర్భావం తరువాత జలాలను ఒడిసిపట్టి నిలువచేసుకునేలా కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మాణం చేసుకోవడం జరిగి నీలి విప్లవాన్ని సాదించడం జరిగిందని అన్నారు. దీని ద్వారా మండుటెండల్లో సైతం చెరువులు మత్తడులు దూకుతున్నాయని అన్నారు. ప్రతి సంవత్సరం 30 లక్షల చేప పిల్లలను విడుదల చేస్తూ ప్రత్యక్షంగా 1500, పరోక్షంగా 900 మంది మత్స్యకారుల కుటుంబాలకు ఉపాధి అవకాశాలు చూపించడం జరుగుతుందని పేర్కోన్నారు. రాష్ట్ర సంపద పెరగాలి, మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం కావాలనే ఉద్దేశ్యంతో జిల్లాలోని 897 చెరువుల లో సుమారుగా 2.29 కోట్ల చేప పిల్లలను ప్రతి ఒక్క చేప పిల్లలకు 1.63 పైసల చొప్పున దాదాపు 162.37 లక్షలు ఖర్చుచేసి చెరువులలో విడుదల చేయడం జరిగిందని తెలిపారు. 2019 సంవత్సరం నుండి ఎల్ఎండిలో 77 లక్షల రొయ్య పిల్లలను విడుదల చేయడం జరిగిందని 19 కోట్ల రూపాయల ఆదాయం వచ్చిందని అన్నారు. భూమిని నీళ్లను నమ్ముకున్న వారికి అండగా నిలబడి భరోసా కల్పిస్తున్నారన్నారు. చేపపిల్లలు పంపిణిలో మత్స్యకారులకు ఎటువంటి ఖర్చులేకుండా రవాణ చార్జీలు, చేప పిల్లల ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరిస్తూ పూర్తిగా ఉచితంగా చేప పిల్లలను పంపిణి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కాళేశ్వరం జలాలతో చెరువులన్ని నిండుకుండలా మారాయని, అద్భుత మత్స్య సంపద పెరిగిందన్నారు. దీంతో దిగుమతి చేసే స్థాయి నుండి ఎగుమతి చేసే స్థాయికి చేరుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్.వి.కర్ణన్, నగర మేయర్ వై.సునీల్ రావు,జిల్లా మత్స్యశాఖ అధికారి దేవేందర్, సిబ్బంది, మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# మల్టీ సౌండ్ హారన్‌లపై కొరఢా వినియోగిస్తే చర్యలు తప్పవు : పెద్దపల్లి ఏసీపీ సారంగపాణి



కరీంనగర్, నవంబర్ 4 (నేటినిజం ప్రతినిధి): మల్టీ సౌండ్ హారన్‌లు ఉపయోగించే వారిపై పెద్దపల్లి పోలీసుల కొరఢా ఝుళిపించారు. శుక్రవారం పెద్దపల్లి ఏసీపీ సారంగపాణి ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా బసంత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్ పోలీసులు ఆకస్మిక వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాల హారన్ ధ్వనులు రొజురోజుకు పెరిగిపోతున్నాయని, గాలి కాలుష్యంతో పాటు-గా శబ్ద కాలుష్యం విపరీతంగా పెరగడంతో, ఇతర వాహనదారులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. మల్టీ సౌండ్ హారన్ లు ఉపయోగిస్తూ భయభ్రాంతులకు గురి చేయడం, ఇతర వాహనాలకు, ఇబ్బంది కలిగించడంతో మల్టీ సౌండ్ హారన్లు ఉపయోగించే వాహనాలపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. మోటార్ వాహనాల చట్టం ప్రకారం వాహనాలకు ఉన్న హారన్లు కాకుండా, మల్టీ సౌండ్ హారన్ వినియోగిస్తే ప్రస్తుతం హారన్లను స్వాధీనం చేసుకుంటామన్నారు. హారన్ల తొలగింపుకు వాహనదారులకు సమయం ఇస్తున్నామని, వారిలో మార్పు రాకపోతే కేసులు నమోదు చేసి, కోర్టుకు పంపి శిక్ష విధించేలా చూస్తామన్నారు. ఈ తనిఖీల్లో పెద్దపల్లి సిఐ ప్రదీప్ కుమార్, పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, ఎస్సై బసంత్ నగర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

# కన్నీటి వీడ్కోలు- చల్లా అంతిమయాత్రకు భారీగా తరలివచ్చిన జనం..



అమరావతి: నవంబర్ 4:అశేష జన వాహిని మధ్య ఎమ్మెల్సీ చల్లా భగీరథ రెడ్డి అంతిమయాత్ర ప్రారంభమైంది. శోక సంద్రంలో అవుకు మండలం. తమ నాయకుడిని చివరి చూపు చూసేందుకు వైఎస్ఆర్సిపి నాయకులు, చల్లా అభిమానులు భారీగా తరలివచ్చారు. ప్రభుత్వ అధికార లాంచనాలతో ఏర్పాట్లు చేశారు. డోన్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, బనగానపల్లె సీఐ సుబ్బరాయుడు, అవుకు, బనగానపల్లె, నందివర్గం, ఎస్ఐలు జగదీశ్వర్ రెడ్డి, రామిరెడ్డి, రామాంజనేయరెడ్డి, రమేష్ రెడ్డి లు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ చల్లా అంతిమయాత్ర చల్లా భవన్ నుండి ప్రారంభమై అవుకు పట్టణ పురవీధుల మీదుగా సాగుతూ చల్లా ఫామ్ హౌస్ లో ఖననం చేశారు.

# ప్యాకేజింగ్ కంపెనీలో భారీ అగ్నిప్రమాదం.. తప్పిన ప్రాణ నష్టం



న్యూఢిల్లీ, నవంబర్ 4:ఓ ప్యాకేజింగ్ కంపెనీలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ప్రాణ నష్టం తప్పింది. కాగా గుజరాత్‌లో వరుస ప్రమాదాలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇటీవల మోర్బీలోని కేబుల్ వంతెన కుప్పకూలి 142 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనను మరువకముందే.. తాజాగా డామన్‌లోని దభేల్ ఏరియాలో శ్రీ గణేశ్ ప్యాకేజింగ్ పేరుతో ఉన్న ఓ ప్యాకేజింగ్ కంపెనీలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆస్తి నష్టమే తప్ప ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. మంటలు భారీగా ఎగిసిపడుతుండటంతో 8 ఫైరింజన్‌ల సాయంతో వాటిని ఆర్పేశారు.

# మంత్రుల వరుసలో కూర్చోమంటే తప్పా : మంత్రి కొప్పుల ఈశ్వర్

కరీంనగర్, నవంబర్ 4 (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ మీడియా సమావేశంలో ఒకవైపు మంత్రులు, మరోవైపు ఎమ్మెల్యేలను కూర్చోబెట్టుకున్నారని, తనను మంత్రుల వరుసలో కూర్చోవాలని చెబితే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలో దళిత సమాజానికి అవమానం అంటూ చిత్రీకరించడం సిగ్గుచేటని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు.

పార్టీకి కేసీఆర్ తండ్రి లాంటి వారని, నన్ను గౌరవించి మంత్రుల వరుసలో కూర్చోమన్నారన్నారు. బీజేపీ ఎమ్మెల్యేల కొనుగోలు కోసం వందలాది కోట్ల రూపాయలు ఆఫర్ చేసిన కుట్రను ముఖ్యమంత్రి కేసీఆర్ సాక్షాదారాలతో బయటపెట్టారన్నారు. మీడియా సమావేశం అనంతరం దేశ ప్రజలందరూ బీజేపీని

ఛీకొడుతుంటే, ఆ అంశంపై ప్రజల దృష్టిని మళ్లించేందుకు దళిత జాతికి అవమానం అంటూ కొత్త డ్రామాకు తెర లేపారన్నారు.

## ఉక్కు మంత్రిత్వ శాఖ ప్రత్యేక ప్రచారం 2.0 ఘన విజయం

న్యూఢిల్లీ, నవంబర్ 4:2022 అక్టోబర్ 2 నుంచి 2022 అక్టోబర్ 31 వరకు జరిగిన 'స్పెషల్ క్యాంపెయిన్ 2.0 ఫర్ డిస్పోజల్ ఆఫ్ పెండింగు మ్యాటర్స్' (ఎస్ సి డి పి ఎం 2.0) లో ఉక్కు మంత్రిత్వ శాఖతో పాటు సెయిల్, ఆర్ఐఎన్ఎల్, ఎన్ఎండీసీ, ఎంఒ ఐఎల్, మెకాన్, కే ఐ ఒ సీఎల్, ఎంఎస్ టిసి మొదలైన ఏడు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు (సీపీఎస్ఇ ) లు చురుగ్గా పాల్గొన్నాయి. స్వచ్ఛత , రికార్డ్ మేనేజ్ మెంట్ ను ఉద్యోగుల మధ్య సాధారణ కార్యకలాపాలుగా సంస్థాగతీకరించడం, పెండింగ్ ను తగ్గించడం, అదేవిధంగా మంత్రిత్వ శాఖకు సంబంధించిన ప్రభుత్వ ముఖ్యమైన అంశాలను సకాలంలో పరిష్కరించడానికి అంతర్గత పర్యవేక్షణ మానిటరింగ్ యంత్రాంగాన్ని బలోపేతం చేయడం ఈ ప్రచార కార్యక్రమం ఉద్దేశం.

2022 సెప్టెంబర్ 14 నుంచి 30 వరకు జరిగిన ఈ ప్రచారం ప్రారంభ దశ ను ప్రచారం గురించి అధికారులకు అవగాహన కల్పించడానికి, క్షేత్రస్థాయి కార్యకర్తలను సమీకరించడానికి, పోకడలను గుర్తించడానికి, ప్రచార నిర్వహణ ప్రదేశాలను ఖరారు చేయడానికి, వ్యర్థ, ఇతర అనవసరమైన వస్తువులను గుర్తించడానికి ఉపయోగించబడింది.

ప్రచారం యొక్క ప్రధాన ఫ్రస్ట్ ప్రాంతాలు: స్క్రాప్, ఫర్నిచర్, కాగితాలు , ఇ-వ్యర్థాల రీసైక్లింగ్ , పరిశుభ్రత కార్యకలాపాల నిర్వహణ , రికార్డ్ మేనేజ్మెంట్ కార్యకలాపాలు, పెండింగ్ లో ఉన్న విఐపి, ఐఎంసి , పిఎంఓ / రాష్ట్ర ప్రభుత్వ రిఫరెన్సులను లిక్విడేట్ చేయడం, ప్రజా ఫిర్యాదులు, పిజి అప్పీళ్ల పరిష్కారం మొదలైన అంశాలపై ప్రచారం దృష్టి పెట్టింది.

ఉక్కు శాఖ మంత్రి (హెచ్.ఎస్.ఎం), ఉక్కు శాఖ సహాయ మంత్రి , ఉక్కు మంత్రిత్వ. శాఖ కార్యదర్శి పర్యవేక్షణ లో ఈ ప్రత్యేక స్వచ్ఛత ప్రచారం చురుగ్గా, ముమ్మరంగా సాగింది. ప్రచారం ప్రణాళిక, అమలు ను క్రమం తప్పకుండా హెచ్ ఎస్ ఎం, ఎం ఓ ఎస్ (స్టీల్), కార్యదర్శి (స్టీల్), ఇతర సీనియర్ అధికారులు వివిధ అంతస్తులు విభాగాలు/గదుల విస్తృత తనిఖీల ద్వారా నిరంతరం సమీక్షించారు. న్యూఢిల్లీలోని సెయిల్ ప్రధాన కార్యాలయంతో సహా ఉద్యోగ్ భవన్ పరిసర ప్రాంతాల్లో ఉక్కు మంత్రి, కేంద్ర మంత్రి (ఉక్కు) పారిశుధ్య కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారులు ఢిల్లీలో ఉన్న సిపిఎస్ఇల కార్యాలయాలను సందర్శించి, వారి ప్రణాళిక, ప్రచార కార్యక్రమాల అమలును సమీక్షించారు.

ఈ ప్రచార సమయంలో, ఉక్కు సిపిఎస్ఇలు మెటాలిక్ , నాన్-మెటాలిక్ స్క్రాప్, కాగితం, ఇ-వ్యర్థాలు మొదలైన వాటిని పారవేయడం ద్వారా 37722 చదరపు అడుగుల స్థలాన్ని ఖాళీ చేశాయి. సుమారు రూ .394 కోట్ల ఆదాయాన్ని ఆర్జించాయి. అలాగే, మంత్రిత్వ శాఖలో 568 చదరపు అడుగుల స్థలం నుంచి పనికి రానివి తొలగించారు. వ్యర్థాల అమ్మకం ద్వారా రూ .0.80 లక్షల ఆదాయాన్ని ఆర్జించారు.

సిపిఎస్ఇలతో కలిసి, 58082 భౌతిక ఫైళ్లు 10258 ఇ-ఫైల్స్ సమీక్షించి 55800 భౌతిక ఫైళ్లు , 7980 ఇ-ఫైల్స్ సమీక్ష లక్ష్యాన్ని అధిగమించారు. కనీసం 43841 భౌతిక ఫైళ్లను తొలగించారు, 4947 ఎలక్ట్రానిక్ ఫైళ్లు మూసివేశారు. ఈ ప్రచార సమయంలో, 237 స్వచ్ఛతా ప్రచారాల లక్ష్యానికి మించి 278 స్వచ్ఛతా ప్రచారాలను మంత్రిత్వ శాఖ , దాని సిపిఎస్ఇలు నిర్వహించాయి. దీనికి అదనంగా, 114 పిజి అప్పీళు లేదా గ్రీవియెన్స్ లు, 12 ఎంపీ రిఫరెన్స్ లు, 8 పిఎమ్ వో రిఫరెన్స్ లు , 2 ఐఎమ్ సి రిఫరెన్స్ లు పరిష్కరించబడ్డాయి. ప్రత్యేక ప్రచారం సందర్భంగా స్టీల్ సిపిఎస్ ఇల ద్వారా ఏడు నిబంధనలు, లేదా ప్రక్రియలు సరళీకృతం చేయబడ్డాయి.

ఈ ప్రచారం 25 కంటే ఎక్కువ ట్వీట్లు , 250 రీట్వీట్లతో మంచి మొత్తంలో సోషల్ మీడియా కవరేజీని పొందింది. ఉక్కు మంత్రిత్వ శాఖ , దాని సిపిఎస్ఇలు ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా "పరిశుభ్రత దైవభక్తి తరువాత" అనే గాంధీజీ దార్శనికతను గుర్తు చేయడానికి వివిధ సోషల్ మీడియా వేదికలపై చురుకుగా పాల్గొన్నాయి.

## పంట పొలాల్లో భారీ కొండచిలువ ప్రత్యక్షం- పరుగులు తీసిన జనాలు!



వరంగల్, నవంబర్ 4:కొండచిలువలు జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి. ఇందుకు నిదర్శనం గత కొంతకాలంగా ఏదో ఒక చోట కొండచిలువలు దర్శనమిస్తూనే ఉన్నాయి. మొన్న స్కూల్ బస్సులో తలదాచుకున్న కొండచిలవను చూశాం.. వారం రోజుల కిందట కోతిని మింగిన కొండచిలువను చూశాం.. ఇవన్నీ వివిధ జిల్లాలో జరిగిన ఘటనలు.. తాజాగా వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలో రైతు పొలంలో కొండ చిలువ ప్రత్యక్షమైంది. కొండ చిలువ కనపడటంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. అనంతరం చాకచక్యంగా వ్యవహరించి కొండ చిలువను పట్టుకుని బస్తాలో వేసి అటవీశాఖ అధికారులకు సమా

## లండన్ సబ్ వే స్టేషన్లో.. పువ్వులు అమ్మిన బ్రిటన్ ప్రధాని రిషి సునాక్




న్యూఢిల్లీ, నవంబర్ 4:పువ్వులు అమ్ముతూ లండన్ సబ్ వే స్టేషన్ లో ప్రత్యక్షమయ్యారు బ్రిటన్ ప్రధాని రిషి సునాక్..ఆఫీసులకు వెళుతున్న ప్రజలకు వెస్ట్‌మినిస్టర్ ట్యూబ్ స్టేషన్‌లో ప్రదాని రిషి సునాక్ ప్లేట్లో పూలు అమ్ముతూ కనిపించడంతో వారంతా షాక్‌కు గురయ్యారు. పేపర్‌తో తయారు చేసిన పూలను ఒక్కోటి 5 పౌండ్లకు ఆయన విక్రయించారు. రాయల్ బ్రిటిష్ లెజియన్ వార్షిక లండన్ పాపీ డే అప్పీల్‌కు నిధుల సేకరణ నిమిత్తం ఆయన ఈ పూలను అమ్ముతూ కనిపించారు. ఈ కార్యక్రమానికి నిధుల సేకరణకు బ్రిటిష్ ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన వాలంటీర్లతో పాటు బ్రిటన్ ప్రధాని సైతం వారితో పాలుపంచుకున్నారు.ప్రధాని సునాక్ తమ కంటపడటంతో ప్రయాణీకులంతా ఆయనతో సన్నిహితంగా మెలుగుతూ ఉత్సాహంగా సెల్ఫీలు తీసుకున్నారు. భారత సంతతికి చెందిన తొలి దేశ ప్రదానితో తాము గడిపిన క్షణాలను కొందరు తమ సోషల్ మీడియా ఖాతాల్లో పంచుకున్నారు.

## గుజరాత్ ఎన్నికల్లో ఆప్ సీఎం అభ్యర్థిగా.. ఇసుధన్ గఢ్వి

న్యూఢిల్లీ, నవంబర్ 4:గుజరాత్ ఎన్నికల్లో ఆప్ సీఎం అభ్యర్థిగా ఇసుధన్ గఢ్వి బరిలోకి దిగనున్నారు.ఈ మేరకు ఆప్ పార్టీ అధికారిక ప్రకటన చేసింది. అంతేకాదు.. గుజరాత్ లోని అన్ని స్థానాల్లో తమ అభ్యర్థులను పెట్టి.. గెలవబోతున్నట్లు కూడా ప్రకటించింది. గుజరాత్ అసెంబ్లీలోని మొత్తం 182 స్థానాలున్నాయి. ఆ రాష్ట్ర అసెంబ్లీ గడువు ఫిబ్రవరిలో ముగియనుంది. మామూలుగా గుజరాత్?లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోటీ ఉండేది. కానీ ఈసారి ఆప్ ఎంట్రీతో సీన్ మారే అవకాశముందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ ఇప్పటికే అభ్యర్థుల లిస్టు విడుదల చేయడంతో గుజరాత్?లో ఈ సారి బీజేపీ, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ మధ్య ముక్కోణపు పోటీ ఖాయమనిపిస్తోంది.

# మహారాష్ట్ర రోజ్ గార్ మేళాను ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 4:మహారాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యం లో ఏర్పాటైన రోజ్ గార్ మేళా ను ఉద్దేశించి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న వీడియో సందేశం మాధ్యం ద్వారా ప్రసంగించారు. ధన్ తేరస్ నాడు రోజ్ గార్ మేళా భావన కు ప్రధాన మంత్రి శుభారంభం చేశారు. కేంద్ర ప్రభుత్వం స్థాయి లో పది లక్షల ఉద్యోగాల ను అందించడం కోసం తలపెట్టిన ఉద్యమం లో ఇది ఆరంభ దశ. అది మొదలు, ప్రధాన మంత్రి గుజరాత్ మరియు జమ్ము కశ్మీర్ ప్రభుత్వాల ఆధ్వర్యం లో సాగిన రోజ్ గార్ మేళా ల ను ఉద్దేశించి ప్రసంగించారు. "అంత స్వల్ప కాలం లో రోజ్ గార్ మేళా ను నిర్వహిస్తుండడాన్ని బట్టి చూస్తే మహారాష్ట్ర ప్రభుత్వం యువతీయువకుల కు ఉద్యోగాల ను ఇచ్చే దిశ లో బలమైన సంకల్పాన్ని చాటుకొంటూ ముందుకు సాగిపోతోందన్నది స్పష్టం. రాబోయే కాలాల్లో అటువంటి రోజ్ గార్ మేళా లను మహారాష్ట్ర లో మరింత గా విస్తరించగలరని తెలిసి నేను కూడా సంతోషిస్తున్నాను." అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. మహారాష్ట్ర హోం డిపార్ట్ మెంటు లో మరియు గ్రామీణ అభివృద్ధి విభాగం లో వేల కొద్దీ నియామకాలు చోటు చేసుకోనున్నాయి.

అమృత కాలం లో అభి వృద్ధి చెందిన దేశం గా రూపొందాలనే లక్ష్యాన్ని అందుకోవాలని దేశం కృషి చేస్తోందని, ఈ ప్రక్రియ లో యువత కీలకమైన పాత్ర ను పోషించనున్నట్లు ప్రధాన మంత్రి పునరుద్ఘాటించారు. "మారుతున్న కాలాల్లో కొలువుల స్వభావం శర వేగం గా మారిపోతున్నది. ప్రభుత్వం కూడాను వేరు వేరు రకాల ఉద్యోగాల కై అవకాశాల ను అదే పని గా సృజించుకొంటూ పోతోంది." అని ఆయన అన్నారు.

ముద్ర పథకం యువత కు అదనపు ఒప్పందం ఏదీ లేకుండానే రుణాల ను ఇస్తున్నది. మరి ఇరవై లక్షల కోట్ల రూపాయల విలువ కలిగిన రుణాల ను ఇప్పటికే పంపిణీ చేయడమైంది అని ఆయన అన్నారు. అదే విధం గా, స్టార్ట్- అప్స్ ను మరియు ఎమ్ఎస్ఎమ్ఇ రంగాన్ని పెద్ద ఎత్తున సమర్ధించడం జరుగుతోంది. మహారాష్ట్ర లో యువతీయువకులు దీని ద్వారా లాభపడ్డారు అని కూడా ఆయన అన్నారు.

ప్రభుత్వం యొక్క ప్రయాసల లో అత్యంత ముఖ్యమైనటువంటి విషయం ఏమిటి అంటే అది ఉద్యోగం మరియు స్వతంత్రోపాధి లకు సంబంధించిన ఈ అవకాశాలు అందరికీ.. దళితుల కు, వెనుకబడిన వర్గాల వారి కి, ఆదివాసి వ్యక్తుల కు, సాధారణ శ్రేణి కి, ఇంకా మహిళల కు.. సమానం గా అందుతున్నాయి" అని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. స్వయం సహాయ సమూహాల తో అనుబంధాన్ని కలిగివున్నటువంటి 8 కోట్ల మంది మహిళ లు 5 లక్షల కోట్ల రూపాయల విలువైన సహాయం పొందినట్లు ప్రధాన మంత్రి ప్రస్తావించారు.

"ప్రస్తుతం, దేశం లో మౌలిక సదుపాయాల రంగం, సమాచార సాంకేతిక విజ్ఞ?న రంగం మరియు ఇతర రంగాల లో ప్రభుత్వం పెడుతున్న రెకార్డు స్థాయి పెట్టుబడులు కొత్త ఉద్యోగావకాశాల ను కల్పిస్తున్నాయి" అని ప్రధాన మంత్రి అన్నారు. మహారాష్ట్ర విషయానికి వస్తే, ఈ రాష్ట్రాని కి 2 లక్షల కోట్ల రూపాయల కు పైగా విలువ కలిగిన దాదాపు 225 ప్రాజెక్టుల కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది అని ప్రధాన మంత్రి వెల్లడించారు. 75 వేల కోట్ల రూపాయల విలువైన రైల్ వే ప్రాజెక్టు ల తో పాటు గా 50 కోట్ల విలువైన ఆధునిక రహదారులకు ఆమోదాన్ని తెలపడమైంది. "ఈ ప్రాజెక్టుల పనులు అయితే నిర్మాణాధీనం లో ఉండడం గాని లేదా పనులు అతి త్వరలో మొదలవడం గాని జరుగనుంది" అని ఆయన అన్నారు. "ప్రభుత్వం ఎప్పుడయితే అంత పెద్ద మొత్తాన్ని మౌలిక సదుపాయాల కల్పన పైన ఖర్చు చేస్తుందో, దాని వల్ల లక్షల కొద్దీ నూతన ఉద్యోగ అవకాశాలు అందివస్తాయి" అని చెబుతూ ప్రధాన మంత్రి తన ప్రసంగాన్ని ముగించారు.

# 'జాతీయ ప్రకృతి సేద్య కార్యక్రమం' సారథ్య సంఘం సమావేశానికి అధ్యక్షత వహించిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ నరేంద్ర సింగ్ తోమర్



న్యూఢిల్లీ, నవంబర్ 4:కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ నరేంద్ర సింగ్ తోమర్ అధ్యక్షతన, ఇవాళ, న్యూదిల్లీలోని కృషి భవన్‌లో 'జాతీయ ప్రకృతి సేద్య కార్యక్రమం' సారథ్య సంఘం మొదటి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో శ్రీ తోమర్ ఎన్ఎంఎన్ఎఫ్ పోర్టల్ ప్రారంభించారు. ప్రకృతి సేద్యం కార్యక్రమాన్ని అందరి సహకారంతో ముందుకు తీసుకువెళ్తామని కేంద్ర మంత్రి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర శాఖలతో సమన్వయం చేసుకుని మార్కెట్ల అనుసంధానం పెంచాలని అధికారులను కోరారు. తద్వారా, రైతులు తమ ఉత్పత్తులను మరింత సులభంగా విక్రయించుకునేందుకు వీలవుతుందన్నారు. కేంద్ర గ్రామీణా భివృద్ధి శాఖ మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్, కేంద్ర జల్ శక్తి మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్, ఉత్తరప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి సూర్య ప్రతాప్ షాహి, కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి శ్రీ మనోజ్ అహుజా, వివిధ మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

శ్రీ నరేంద్ర సింగ్ తోమర్ ఇవాళ ప్రారంభించిన పోర్టల్‌ను (http://naturalfarming.dac.gov.in/)'1కేంద్ర వ్యవసాయ ఒ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ అభివృద్ధి చేసింది. కార్యక్రమం గురించి పూర్తి సమాచారం, అమలు విధానం, వనరులు, అమలు పురోగతి, రైతుల పేర్లు నమోదు, బ్లాగ్ ఈ పోర్టల్‌లో ఉంటాయి. ఇవన్నీ రైతులకు ఉపయోగపడతాయి. దేశంలో ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించడానికి ఈ వెబ్‌సైట్ సహాయపడుతుంది.

ఈ సమావేశంలో మాట్లాడుతూ.. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించేందుకు మంచి కార్యక్రమాలు చేపట్టామని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్ చెప్పారు. ఆయన కొన్ని సూచనలు కూడా అందించారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో, గంగానది ఒడ్డున ప్రకృతి సేద్యం చేపట్టినట్లు జల్ శక్తి మంత్రి శ్రీ షెకావత్ తెలిపారు. 'సహకార భారతి'తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న జల్ శక్తి మంత్రిత్వ శాఖ, మొదటి దశలో 75 సహకార గంగ గ్రామాలను గుర్తించింది. ప్రకృతి సేద్యం కోసం విధానాలు రూపొందించి, రైతులకు శిక్షణ ఇచ్చింది.

నమామి గంగే ప్రాజెక్టు కింద తమ రాష్ట్రంలో ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించడం ప్రారంభించామని ఉత్తరప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ షాహి చెప్పారు. ప్రతి విభాగంలో పనిచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుని, సుశిక్షిత శిక్షణ ఇచ్చారు.

2021 డిసెంబర్ నుంచి, 17 రాష్ట్రాల్లో 4.78 లక్షల హెక్టార్లకు పైగా అదనపు వ్యవసాయ భూములను ప్రకృతి సేద్యం కిందకు తీసుకువచ్చినట్లు సమావేశంలో వెల్లడించారు. 7.33 లక్షల మంది రైతులు ప్రకృతి సేద్యంలో పాల్గొంటున్నారు. రైతుల కోసం సుమారు 23 వేల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. గంగా నది ఒడ్డున నాలుగు రాష్ట్రాల్లో 1.48 లక్షల హెక్టార్లలో ప్రకృతి సేద్యం జరుగుతోంది.

## మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి : మంత్రి గంగుల కమలాకర్



కరీంనగర్, నవంబర్ 4 (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ఆవిర్భావానికి ముందు రాష్ట్రంలో వర్షాలు పడితే గాని చెరువులు నిండని పరిస్థితులు ఉండేవని, ప్రస్తుతం మండుటెండలో సైతం చెరువులు మత్తడులు దూకడంతో మత్స్య కారులకు న్యాయం జరిగిందని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖా మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం ఎల్ఎండీ జలాశయంలోని గంగమ్మ దేవాలయం వద్ద మత్స్య శాఖా ఆధ్వర్యంలో 100 శాతం ఉచితంగా 3 లక్షల రొయ్య పిల్లలను నగర మేయర్, జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి విడుదల చేశారు. అనంతరం పత్రికా విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ ఆవిర్భావం తరువాత జలాలను ఒడిసిపట్టి నిలువచేసుకునేలా కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మాణం చేసుకోవడం జరిగి నీలి విప్లవాన్ని సాధించడం జరిగిందని అన్నారు. దీని ద్వారా మండుటెండల్లో సైతం చెరువులు మత్తడులు దూకుతున్నాయని అన్నారు. ప్రతి సంవత్సరం 30 లక్షల చేప పిల్లలను విడుదల చేస్తూ ప్రత్యక్షంగా 1500, పరోక్షంగా 900 మంది మత్స్యకారుల కుటుంబాలకు ఉపాధి అవకాశాలు చూపించడం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర సంపద పెరగాలి, మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం కావాలనే ఉద్దేశ్యంతో జిల్లాలోని 897 చెరువులలో సుమారుగా 2.29 కోట్ల చేప పిల్లలను ప్రతి ఒక్క చేప పిల్లలకు 1.63 పైసల చొప్పున దాదాపు 162.37 లక్షలు ఖర్చుచేసి చెరువులలో విడుదల చేయడం జరిగిందని తెలిపారు. 2019 సంవత్సరం నుండి ఎల్ఎండి లో 77 లక్షల రొయ్య పిల్లలను విడుదల చేయడం జరిగిందని 19 కోట్ల రూపాయల ఆదాయం వచ్చిందని అన్నారు. భూమిని నీళ్లను నమ్ముకున్న వారికి అండగా నిలబడి భరోసా కల్పిస్తున్నారన్నారు. చేపపిల్లలు పంపిణీలో మత్స్యకారులకు ఎటువంటి ఖర్చులేకుండా రవాణ చార్జీలు, చేప పిల్లల ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరిస్తూ పూర్తిగా ఉచితంగా చేప పిల్లలను పంపిణి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కాలేశ్వరం జలాలతో చెరువులన్ని నిండుకుండలా మారాయని, అద్భుత మత్స్య సంపద పెరిగిందన్నారు. దీంతో దిగుమతి చేసే స్థాయి నుండి ఎగుమతి చేసే స్థాయికి చేరుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్.వి.కర్ణన్, నగర మేయర్ వై.సునీల్ రావు,జిల్లా మత్స్యశాఖ అధికారి దేవేందర్, సిబ్బంది, మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## గుజరాత్ ఆప్ సీఎం అభ్యర్థిగా ఇసుదన్ గాఢ్వి.. ప్రకటించిన కేజ్రీవాల్

న్యూఢిల్లీ, నవంబర్ 4: గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలకు తేదీలను ఈసీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ రాష్ట్రంలో తమ పార్టీ తరపున పోటీపడే సీఎం అభ్యర్థిని ఆప్ ప్రకటించింది. ఆప్ జాతీయ కార్యదర్శి ఇసుదన్ గాఢ్విని గుజరాత్ ఎన్నికల్లో సీఎం అభ్యర్థిగా బరిలోకి దించుతున్నట్లు ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు.

గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల తేదీలను కేంద్రం ఎన్నికల సంఘం గురువారం ప్రకటించిన విషయం తెలిసిందే.

రెండు దశల్లో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. డిసెంబర్ ఒకటో తేదీన తొలి దఫా, అయిదవ తేదీన రెండో దఫా ఎన్నికలను నిర్వహించనున్నారు.

డిసెంబర్ 8వ తేదీన ఫలితాలను వెల్లడించనున్నట్లు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు. తొలి విడుతలో 89 స్థానాలకు, రెండవ విడుతలో 93 స్థానాలకు పోలింగ్ జరగనున్నట్లు ఆయన వెల్లడించారు.

## వ్యర్థాల నుంచి సంపద సృష్టి - ప్రత్యేక కార్యక్రమం 2.0



న్యూఢిల్లీ, నవంబర్ 4:ఉత్తమ పరిపాలన విధానాలు, రికార్డుల నిర్వహణ, వినూత్న విధానాలతో కార్యాలయాల స్థల యాజమాన్యం ప్రధాన అంశాలుగా 2022 2వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ప్రత్యేక ప్రచారం 20 కార్యక్రమం అమలు జరిగింది. మొత్తం ప్రభుత్వం విధాన స్ఫూర్తితో పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం పర్యవేక్షణలో కార్యక్రమం అమలు జరిగింది.

కార్యక్రమంలో భాగంగా శతాబ్దాల చరిత్ర కలిగిన అత్యంత విలువైన చరిత్రాత్మక పత్రాలను భద్రపరచడానికి నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా సహకారంతో పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం అనేక కార్యక్రమాలు చేపట్టింది. గ్రంథాలయాల్లో ప్రదర్శించడానికి వీలుగా కొన్ని పత్రాలను అభివృద్ధి చేయడం జరిగింది. శిలనుబంధంలో జాబితా జోడించడం జరిగింది.

మొదటిసారిగా సెంట్రల్ సెక్రటేరియట్ మాన్యువల్ ఆఫ్ ఆఫీస్ ప్రొసీజర్ హిందీ అనువాదం కూడా అందుబాటులోకి వచ్చింది. అనేక కేంద్ర మంత్రిత్వ శాఖలు సెంట్రల్ సెక్రటేరియట్ మాన్యువల్ ఆఫ్ ఆఫీస్ ప్రొసీజర్ లో పొందుపరిచిన నిబంధనలకు అనుగుణంగా కేంద్ర మంత్రిత్వ శాఖలు పనిచేస్తాయి. కేంద్ర సచివాలయం పని సంక్లిష్టంగా, విభిన్నంగా ఉంటుంది.దీనికోసం సెంట్రల్ సెక్రటేరియట్ మాన్యువల్ ఆఫ్ ఆఫీస్ ప్రొసీజర్ ప్రామాణిక ప్రక్రియ, విధానాలు నిర్దేశిస్తుంది.

ప్రత్యేక ప్రచారం 2.0 కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రానిక్ మరియు భౌతిక వ్యర్థాలను తొలగించిన పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం .48, 500 రూపాయల ఆదాయాన్ని ఆర్జించింది. దాదాపు 200 చదరపు అడుగుల స్థలాన్ని వినియోగంలోకి తెచ్చింది.

## నవజాత శిశువు కడుపులో ఎనిమిది పిండాలు.. తొలగించిన డాక్టర్స్



న్యూఢిల్లీ, నవంబర్ 4:పుట్టి నెల రోజులు కాని ఓ శిశువు పొట్ట నుండి ఎనిమిది పిండాలను తొలగించారు డాక్టర్స్. కాగా ఇది ప్రపంచ వైద్య చరిత్రలోనే వింత. ఈ అత్యంత అరుదైన ఈ ఘటన ఝార్ఖండ్‌లో చోటుచేసుకుంది. రాంచీలోని రామ్‌గఢ్‌లో అక్టోబరు 10న ఓ పాప జన్మించింది. ఆ తర్వాత ఆ చిన్నారి కడుపు నొప్పితో బాధపడుతుండడంతో తల్లిదండ్రులు ఆమెను స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. సీటీ స్కాన్ నిర్వహించిన వైద్యులు కడుపులో కణితులు ఉన్నట్టు గుర్తించారు. అనంతరం 21 రోజులు పర్యవేక్షణలో ఉంచారు. ఈ నెల 1న కణితులు తొలగించేందుకు వైద్యులు ఆపరేషన్ నిర్వహించారు. ఆపరేషన్ చేస్తున్న వైద్యులు లోపల కనిపించిన దృశ్యం చూసి ఆశ్చర్యపోయారు. అవి కణితులు కావని, సరిగా అభివృద్ధి చెందని పిండాలని గుర్తించారు. గంటన్నరపాటు ఆపరేషన్ చేసి వాటిని తొలగించారు. శిశువుల పొట్టలో అభివృద్ధి చెందని పిండాలు వెలుగు చూసిన ఘటనలు ప్రపంచవ్యాప్తంగా వందలోపే ఉన్నట్టు ఈ సందర్భంగా వైద్యులు తెలిపారు. ఆయా కేసుల్లో ఒక పిండాన్ని మాత్రమే తొలగించారని, కానీ నవజాత శిశువులో ఏకంగా 8 పిండాలు ఉన్నాయని, ఇలాంటి ఘటన ప్రపంచంలో ఇదే మొదటిదని వైద్యులు వివరించారు.





ఆహ్వానం

చంద్రలత

నీలంపురాణి

భరిణలకెత్తుతూ... బండ్లకెత్తుతూ... ఓడలకెత్తుతూ...

నవల ఆవిష్కరణ సభ

సాయంకాలం 5-00 గం.లకు
ఆదివారం, 13 నవంబర్ 2022
ప్రభవ లో

ఆవిష్కర్త ఆచార్య జి.ఎం. సుందరవల్లి
వైస్ ఛాన్సలర్, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, నెల్లూరు
ప్రత్యేక అతిథి డా. వి. ప్రసూన చంద్రశేఖర రావు, గుంటూరు
ఆత్మీయ అతిథులు విఠపు బాలసుబ్రమణ్యం, ఎం.ఎల్.సి., నెల్లూరు
గుడిపూడి సుబ్బారావు, రైతు, రచయిత, అన్నారం, ఖమ్మం
విశ్వేశ్వరరావు, ప్రచురణకర్త, విజయవాడ
నవల పరిచయం డా. ఈమని శివనాగిరెడ్డి, స్థపతి, హైదరాబాద్
ఆచార్య మధురాంతకం నరేంద్ర, రచయిత, తిరుపతి
బండ్ల మాధవరావు, సంపాదకులు, కవితా! విజయవాడ
స్పందన చంద్రలత, రచయిత, ప్రభవ
నిర్వహణ ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు, పాత్రికేయులు, రచయిత, తిరుపతి
ఆహ్వానం ఈతకోట సుబ్బారావు, సంపాదకులు, విశాలాక్షి, నెల్లూరు

## రైతుల అభివృద్ధికే శీతల గిడ్డంగులు: ఎమ్మెల్యే దాసరి



కరీంనగర్, నవంబర్ 4 (నేటినిజం ప్రతినిధి): రైతులు అభివృద్ధి చెందాలనే గొప్ప సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు సుల్తానాబాద్‌లో శీతల గిడ్డంగుల నిర్మాణం చేపట్టారని పెద్దపల్లి శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్లో నూతనంగా 50 లక్షల రూపాయలతో నిర్మాణం చేపట్టిన శీతల గిడ్డంగులను ఆయన ప్రారంభించారు. అలాగే మార్కెట్లో రైతుల సౌకర్యార్థం 10 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన క్యాంటీన్ ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన కూరగాయలు, పండ్లు ఇతర నిత్యావసర పదార్థాలను నిల్వ చేసి విక్రయించేందుకు గిడ్డంగుల నిర్మాణం చేపట్టామని, తద్వారా తాము పండించిన పంట వృధా కాకుండా తాజాగా ఉండేందుకు గిడ్డంగులు ఉపయోగపడతాయన్నారు.

అలాగే రైతులు మార్కెట్ కు వచ్చిన సందర్భంలో వారికి అందుబాటులో ఉండే విధంగా 10 లక్షల రూపాయలతో క్యాంటీన్ ఏర్పాటు చేయడం జరిగిందని, దీనిని తమ ధాన్యాన్ని విక్రయించేందుకు వచ్చిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మార్కెట్లో విక్రయించే పండ్లు, అల్లం, ఉల్లిపాయ, ఎల్లిగడ్డ, మిర్చి లాంటివి తాజాగా ఉండేందుకు ఉపయోగపడతాయన్నారు.

## ఈ నెల 7 నుండి 19 వరకు టి.డి. (టెటనస్ అండ్ డిఫ్తీరియా ) టీకా ఇవ్వనున్నాం




మెదక్, నవంబర్ 4: నేటినిజం (ప్రతినిధి):ధనుర్వాతం, కంఠసర్పి (డిఫ్తీరియా ) వ్యాధుల నుండి పిల్లలను రక్షించుటకు ఈ నెల 7 నుండి 19 వరకు టి.డి. (టెటనస్ అండ్ డిఫ్తీరియా ) టీకా ఇవ్వనున్నామని అదనపు కలెక్టర్ రమేష్ తెలిపారు. ధనుర్వాతం రాకుండా గతంలో టెటనస్ టీకా ఇచ్చేవారమని కానీ డిఫ్తీరియా తో పిల్లలు బాధపడుచున్నారని గుర్తించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ 2017 నుండి టెటనస్ స్థానములో టి.డి. వ్యాక్సిన్ ను ఇస్తున్నారని అన్నారు. కరోనా వల్ల గత రెండు సంవత్సరాల నుండి పిల్లలకు పూర్తి స్థాయిలో టీకా ఇవ్వలేకపోయిన దృష్ట్యా ఈ నెల 7 నుండి 19 వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో ఇంతవరకు 50 శాతం మేర టి.డి. టీకాలు ఇచ్చామని, మిగతా 50 శాతం మందికి టీకాలు ఇచ్చేందుకు పాఠశాలలను వేదికగా చేసుకొని ఈ ప్రత్యేక ఉద్యమాన్ని చేపట్టామని అన్నారు. పాఠశాలలో చదువుచున్న 10 మరియు 16 సంవత్సరాల వయసున్న విద్యార్థులు అనగా 5వ తరగతి, 10 వ తరగతి చదువుచున్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలలోని విద్యార్థులకు టీకా ఇవ్వనున్నామని రమేష్ తెలిపారు. కాగా బడిబయట ఉన్న పిల్లలకు అంగన్వాడీ కేంద్రాలలో ఇవ్వనున్నామని అన్నారు. జిల్లాలో ఈ వయస్సు ఉన్నవారు 25,423 మంది ఉన్నట్లు గుర్తించామని అన్నారు. ఇందులో 10 సంవత్సరాల వయస్సు గల వారు 14,218 మంది కాగా, 16 సంవత్సరాల వయస్సు గలవారు 10,955, బడిబయట ఉన్నవారు 250 మంది ఉన్నారని రమేష్ తెలిపారు. ప్రతి ఏ.యెన్.ఎం. రోజు 250 డోసు టీకాలు ఇచ్చే విధంగా కార్యాచరణ రూపొందించుకొని ముందస్తుగా ఆ పాఠశాలలకు తెలుపుతూ ఒక్క విద్యార్థి మిగలకుండా వంద శాతం లక్ష్యాన్ని సాధించాలన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకొని 5, 10 వ తరగతి పిల్లలందరికీ టిడి టీకా తీసుకునేలా అవగాహనా కలిగించాలని, టీకా ఇచ్చేందుకు ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాలని, పాఠశాలలో అందరికి టీకా ఇచ్చినట్లు ధ్రువపత్రం ఇవ్వాలని సూచించారు. జిల్లాలోని ఎస్సి, ఎస్టీ,బి.సి. మైనారిటీ , ఐ.సి.డి.ఎస్. అధికారులు, విద్యా శాఖ సమన్వయంతో పనిచేస్తూ స్పెషల్ డ్రైవ్ ను విజయవంతం చేయాలని కోరారు. బడి బయట, బడి లోపల ఉన్న 10, 16 సంవత్సరాల పిల్లలు టిడి టీకా వేసుకునేలా అవగాహన కలిగించవలసినదిగా జిల్లా పరిషద్ పంచాయతీ రాజ్, డి..ఆర్.డి.ఓ. అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి విజయ నిర్మల, డీఈఓ రమేష్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి రాజి రెడ్డి, జిల్లా ఇమ్మ్యూనైజషన్ అధికారి మాధురి, మాస్ మీడియా అధికారి రమ, డాక్టర్ నవీన్, జిల్లా మైనారిటీ అధికారి జెంలా నాయక్, జిల్లా మహిళా సంక్షేమాధికారి నుండి పద్మ, డిపిఆర్ ఓ శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.




## 2020-21 సంవత్సరానికి రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల పనితీరు గ్రేడింగ్ సూచిక నివేదిక విడుదల చేసిన విద్యా మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, నవంబర్ 4:విద్యా రంగంలో రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు 2020-21 సంవత్సరంలో కనబరిచిన పనితీరు గ్రేడింగ్ సూచిక నివేదికను పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం విడుదల చేసింది. రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలలోని పాఠశాల విద్యా వ్యవస్థ పనితీరును సాక్ష్యం ఆధారిత సమగ్ర విశ్లేషణ ఆధారంగా రూపొందిన ప్రత్యేక సూచికను నివేదికలో పొందుపరిచారు.

14.9 లక్షల పాఠశాలలు, వివిధ సామాజిక, ఆర్థిక రంగాలకు చెందిన దాదాపు 26.5 కోట్ల మంది విద్యార్థులు, 95 లక్షల మంది ఉపాధ్యాయులతో భారతీయ విద్యా వ్యవస్థ ప్రపంచంలోనే అతి పెద్ద విద్యా వ్యవస్థ గా గుర్తింపు పొందింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో విద్యా రంగం సాధించిన ప్రగతి, విజయాలు మదింపు వేసేందుకు పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం సాక్ష్యం ఆధారిత సమగ్ర విశ్లేషణ పీజీఐ ని రూపొందించింది. విద్యా వ్యవస్థ పనితీరును విశ్లేషించి లోపాలు సరిదిద్దేందుకు పీజీఐ ఉపయోగపడుతుంది. ఇంతవరకు 2017-18, 2018-19 జీనిట 2019-20 సంవత్సరాలకు సంబంధించి పీజీఐ నివేదికలను పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం విడుదల చేసింది. తాజాగా 2020-21 పీజీఐ నివేదిక విడుదల అయ్యింది. 70 సూచికలను రెండు విభాగాలుగా విభజించి 1000 పాయింట్లకు ఫలితాలు, పరిపాలన యాజమాన్యం విభాగాల్లో పీజీఐ అధ్యయనం నిర్వహించారు. ఫలితాలు, పరిపాలన యాజమాన్యం విభాగాలు బోధన ఫలితాలు, అందుబాటు, మౌలిక సదుపాయాలు, సమానత్వం, పరిపాలన ప్రక్రియ పేరిట ఉప విభాగాలు గా విభజించబడ్డాయి.

గతంలో నిర్వహించిన విధంగా పీజీఐ 2020-21 కోసం పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలను పది గ్రేడ్‌లుగా వర్గీకరించింది. అత్యధికంగా సాధించగల గ్రేడ్ లెవెల్ 1. 1000 పాయింట్‌లలో 950 పాయింట్ల కంటే ఎక్కువ పాయింట్లు పొందిన రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు గ్రేడ్ లెవెల్ 1 పొందుతాయి. అత్యల్ప తక్కువ గ్రేడ్ లెవెల్ 10. 551 కంటే తక్కువ స్కోరు పొందిన రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు ఈ స్థాయిలో ఉంటాయి. ప్రతి స్థాయిలో విద్యా వ్యవస్థ పటిష్టంగా ఉండేలా చూసేందుకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు అన్ని అంశాల్లో సహకారం అందించాలన్న లక్ష్యంతో పీజీఐ అధ్యయనం జరిగింది.

మొత్తం 7 రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలు- కేరళ, పంజాబ్, చండీగఢ్, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ మరియు ఆంధ్రప్రదేశ్ 2020-21లో లెవెల్ ఎఎ (స్కోరు 901-950) ను చేరుకున్నాయి. 2017-18 లో నాలుగు రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు ఈ స్థాయి సాధించాయి. అత్యున్నత స్థాయి సాధించిన రాష్ట్రాల జాబితాలో గుజరాత్, రాజస్థాన్ మరియు ఆంధ్రప్రదేశ్ కొత్తగా స్థానం సాధించాయి. కొత్తగా ఏర్పడిన కేంద్రపాలిత ప్రాంతం లడఖ్ 2020-21 స్థాయి 4 ని సాధించింది. 2020-21 లో స్థాయి 8 లో ఉన్న లడఖ్ పీజీఐ గణనీయమైన మెరుగుదలను సాధించింది. 2019-20తో పోలిస్తే 2020-21లో 299 పాయింట్ల మేర స్కోర్‌ను మెరుగుపరుచుకుంది, దీని ఫలితంగా లడఖ్ ఒకే సంవత్సరంలో అత్యధిక అభివృద్ధి సాధించింది.

2020-21లో రాష్ట్రాలు/కేంద్రపాలిత సాధించిన స్కోర్లు మరియు గ్రేడ్‌లు పీజీఐ వ్యవస్థ సమర్థతకు నిదర్శనంగా ఉంటాయి. సూచిక వారీగా పీజీఐ స్కోర్ రాష్ట్రం మెరుగు పరచాల్సిన ప్రాంతాలను చూపుతుంది. పీజీఐ అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల పనితీరును ఏకరీతి విధానంలో ప్రతిబింబిస్తుంది. మెరుగైన పనితీరు ప్రదర్శించడానికి మరియు ఉత్తమ విధానాలు అమలు చేసి ఇతర రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలను అధిగమించేందుకు పీజీఐ ప్రోత్సహిస్తుంది.

## నూతన ఫిర్యాదు నిర్వహణ వ్యవస్థ పోర్టల్‌ను ప్రారంభించిన - సి.వి.సి.

న్యూఢిల్లీ, నవంబర్ 4:న్యూఢిల్లీ, నవంబర్ 4:నిఘా అవగాహన వారోత్సవాల సందర్భంగా ఈ రోజు న్యూ ఢిల్లీ లోని విజ్ఞాన్ భవన్ లో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సి.వి.సి) నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు. సి.వి.సి కి చెందిన నూతన ఫిర్యాదు నిర్వహణ వ్యవస్థ పోర్టల్ ను ఆయన ప్రారంభించారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధానమంత్రి మాట్లాడుతూ, సర్దార్ పటేల్ జయంతి తో నిఘా అవగాహన వారోత్సవాలు ప్రారంభమయ్యాయని చెప్పారు. ''సర్దార్ పటేల్ జీవితమంతా నిజాయితీ, పారదర్శకత వంటి విలువల ఆధారంగా ప్రజా సేవా వ్యవస్థ నిర్మాణానికి అంకితం చేయబడింది" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. అవగాహన, అప్రమత్తత చుట్టూ తిరుగుతున్న ప్రచారం ఈ సూత్రాలపైనే ఆధారపడి ఉందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. అవినీతి రహిత భారతదేశ కలలు, ఆకాంక్షలను సాకారం చేసేందుకు ఈ నిఘా అవగాహన వారోత్సవాల ప్రచారం జరుగుతోందని, ప్రతి పౌరుడి జీవితంలో దీని ప్రాముఖ్యత ఎంతో ఉందని, ఆయన నొక్కి చెప్పారు.

అభివృద్ధి చెందిన భారతదేశానికి విశ్వాసం మరియు విశ్వసనీయత చాలా కీలకమని, ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకం ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని, ప్రధానమంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు ప్రజల విశ్వాసాన్ని కోల్పోవడంతో పాటు, ప్రజలను విశ్వసించడంలో కూడా విఫలమయ్యాయని ప్రధానమంత్రి విచారం వ్యక్తం చేశారు. అవినీతి, దోపిడీ, వనరులపై నియంత్రణ యొక్క దీర్ఘకాల బానిసత్వం నుండి సంక్రమించిన వారసత్వం, దురదృష్టవశాత్తు, స్వాతంత్ర్యం తర్వాత మరింత బలపడింది. దీని వల్ల దేశంలోని కనీసం నాలుగు తరాల వారికి తీవ్ర నష్టం వాటిల్లిందని ఆయన అన్నారు. ''దశాబ్దాల తరబడి సాగిన ఈ మార్గాన్ని ఆజాదీ-కా-అమృత్-కాల్ సమయంలో మనం పూర్తిగా మార్చుకోవాలి", అని ప్రధానమంత్రి సూచించారు.

అవినీతికి వ్యతిరేకంగా నిర్ణయాత్మక పోరు కోసం ఎర్రకోట ప్రాకారాల నుంచి తమ స్పష్టమైన పిలుపును ప్రధానమంత్రి ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ, అవినీతికి, ప్రజల పురోగతికి ఆటంకం కలిగించడానికి, సౌకర్యాల కొరత మరియు ప్రభుత్వం నుండి అనవసరమైన ఒత్తిడి రెండు ప్రధాన కారణాలని పేర్కొన్నారు. చాలా కాలం పాటు, ఈ సౌకర్యాలు, అవకాశాలు లేకపోవడాన్ని ఉద్దేశపూర్వకంగా సజీవంగా ఉంచబడిందనీ, అదేవిధంగా, ఎటువంటి ప్రయోజనం లేని అనారోగ్య పోటీకి దారితీసే అంతరాన్ని విస్తరించడానికి అనుమతించబడిందనీ, ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ పోటీ అవినీతి పర్యావరణ వ్యవస్థను పోషించింది. ఈ కొరత సృష్టించిన అవినీతి, పేద మరియు మధ్యతరగతి వర్గాలను ఎక్కువగా ప్రభావితం చేసింది. "పేద, మధ్యతరగతి ప్రజలు కేవలం ప్రాథమిక సౌకర్యాలు కోసమే తమ శక్తిని ఖర్చు చేస్తూ పోతే, దేశం ఎలా అభివృద్ధి చెందుతుంది?" అని ప్రధానమంత్రి ప్రశ్నించారు. ''అందుకే, మేము గత 8 సంవత్సరాలుగా ఈ కొరత మరియు ఒత్తిడి వ్యవస్థను మార్చడానికి ప్రయత్నిస్తున్నాము" అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. సరఫరా మరియు డిమాండ్ మధ్య అంతరాన్ని పూరించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. దీనిని సాధించడానికి అనుసరించిన మూడు మార్గాలు సాంకేతికతలో పురోగతి, ప్రాథమిక సేవలను సంతృప్త స్థాయికి తీసుకెళ్లడం, చివరకు ఆత్మనిర్భరత వైపు వెళ్లడం.

టెక్నాలజీ వినియోగం గురించి ప్రధానమంత్రి వివరిస్తూ, పి.డి.ఎస్. ని టెక్నాలజీకి అనుసంధానం చేయడం, కోట్లాది నకిలీ లబ్ధిదారులను తొలగించడం, ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డి.బి.టి) ని అనుసరించడం ద్వారా సంఘ వ్యతిరేక శక్తుల చేతుల్లోకి వెళ్లకుండా 2 లక్షల కోట్ల రూపాయలకు పైగా ఆదా చేయడం గురించి ప్రస్తావించారు. అదేవిధంగా, పారదర్శక డిజిటల్ లావాదేవీలను స్వీకరించడం మరియు జి.ఈ.ఎం. ద్వారా పారదర్శక ప్రభుత్వ సేకరణలు భారీ వ్యత్యాసాన్ని కలిగిస్తున్నాయి.

ప్రాథమిక సౌకర్యాలను సంతృప్త స్థాయికి తీసుకెళ్లడం గురించి ప్రధాన మంత్రి మాట్లాడుతూ, ఏదైనా ప్రభుత్వ పథకం అర్హులైన ప్రతి లబ్ధిదారుని చేరుకోవడంతో పాటు, సంతృప్త లక్ష్యాలను సాధించడం ద్వారా అవినీతి పరిధిని నిర్మూలించడం తో పాటు సమాజంలో వివక్ష కు ముగింపు పలకవచ్చని సూచించారు. ప్రతి పథకం పంపిణీకి ప్రభుత్వం అవలంబిస్తున్న సంతృప్త తత్వాన్ని ప్రధానమంత్రి ప్రముఖంగా పేర్కొంటూ, నీటి కనెక్షన్లు, పక్కా ఇళు, కరెంటు కనెక్షన్లు, గ్యాస్ కనెక్షన్ల ను ఉదాహరించారు.

విదేశీ వస్తువులపై ఎక్కువగా ఆధారపడటం కూడా అవినీతికి ఒక పెద్ద కారణంగా పరిణమించిందని ప్రధానమంత్రి అభిప్రాయపడ్డారు. రక్షణ రంగంలో ఆత్మనిర్భరత వైపు ప్రభుత్వం చేస్తున్న కృషిని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. రైఫిల్స్ నుండి యుద్ధ విమానాలు, రవాణా విమానాల వరకు భారతదేశం తన సొంత రక్షణ పరికరాలను తయారు చేయడం వల్ల అవినీతికి ఆస్కారం లేకుండా పోతోందని ఆయన నొక్కి చెప్పారు.

సి.వి.సి. అనేది పారదర్శకతను నిర్ధారించడానికి ప్రతి ఒక్కరి ప్రయత్నాలను ప్రోత్సహించే సంస్థగా ప్రధానమంత్రి పేర్కొంటూ, 'నివారణ విజిలెన్స్' కోసం గతంలో తాను చేసిన అభ్యర్థనను గుర్తు చేసుకున్నారు. ఆ దిశగా సి.వి.సి. కృషిని ప్రధానమంత్రి ప్రశంసించారు. తమ ఆడిట్ లు, తనిఖీలను ఆధునీకరించడంపై విజిలెన్స్ సమాజం ఆలోచించాలని ఆయన కోరారు. ''అవినీతికి వ్యతిరేకంగా ప్రభుత్వం చూపుతున్న సంకల్పం అన్ని శాఖల్లోనూ అదే స్థాయిలో కనిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అభివృద్ధి చెందిన భారతదేశం కోసం, అవినీతిని ఏమాత్రం సహించని పరిపాలనా పర్యావరణ వ్యవస్థను మనం అభివృద్ధి చేయాలి", అని ఆయన సూచించారు.

అవినీతికి సంబంధించిన క్రమశిక్షణా ప్రక్రియలను సమయానుకూలంగా, నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రి కోరారు. క్రిమినల్ కేసులను నిరంతరం పర్యవేక్షించాలని, పెండింగు లో ఉన్న అవినీతి కేసుల ఆధారంగా శాఖలకు ర్యాంకింగ్ ను రూపొందించాలని, సంబంధిత నివేదికలను నెలవారీ లేదా త్రైమాసిక ప్రాతిపదికన ప్రచురించాలని ఆయన సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో నిఘా కేసులను పరిష్కరించే ప్రక్రియను క్రమబద్ధీకరించాలని కూడా ప్రధానమంత్రి కోరారు. ప్రజా ఫిర్యాదుల సమాచారాన్ని ఆడిట్ చేయాల్సిన అవసరం ఉందని, తద్వారా సంబంధిత శాఖలో అవినీతికి గల మూల కారణాలను విశ్లేషించవచ్చునని ప్రధానమంత్రి సూచించారు.

అవినీతి పై నిఘా పెట్టే పనిలో సామాన్య పౌరులను సైతం తీసుకురావాల్సిన అవసరాన్ని ప్రధానమంత్రి నొక్కి చెప్పారు. "అవినీతిపరులు ఎంత శక్తివంతులైనా, వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ రక్షించకూడదు, అది మీ లాంటి సంస్థల బాధ్యత. అవినీతిపరులు ఎవరికీ కూడా రాజకీయ-సామాజిక మద్దతు లభించకూడదనీ, ప్రతి అవినీతిపరుడినీ సమాజం దూరంగా ఉంచాలనీ, ఇటువంటి వాతావరణాన్ని సృష్టించడం చాలా అవసరమని కూడా ఆయన చెప్పారు. ఆందోళన కలిగించే ధోరణి గురించి ప్రధాన మంత్రి మాట్లాడుతూ, "అవినీతిపరులుగా నిరూపించబడి, జైలు శిక్ష అనుభవించిన వ్యక్తులు కూడా వివిధ సందర్భాల్లో అనేకసార్లు కీర్తించబడుతున్నారు; ఈ పరిస్థితి భారతీయ సమాజానికి మంచిది కాదు. నేటికీ కొందరు దోషులుగా తేలిన అవినీతిపరులకు అనుకూలంగా వాదనలు వినిపిస్తున్నారు. అలాంటి వారికి, అలాంటి శక్తులకు సమాజం తమ కర్తవ్యాన్ని తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో, మీ శాఖ తీసుకునే ఖచ్చితమైన చర్య చాలా పెద్ద పాత్రను కలిగి ఉంటుంది.

అవినీతి మరియు అవినీతిపరులకు వ్యతిరేకంగా పనిచేసే సి.వి.సి. వంటి సంస్థలు ఏ విధంగానూ, ఆత్మరక్షణ కోసం ఎదురుచూడవలసిన అవసరం లేదని, ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. అదే విధంగా, వారు ఏ రాజకీయ అజెండాతో పని చేయాల్సిన అవసరం లేదనీ, సాధారణ ప్రజల జీవితాలను సులభతరం చేయడానికి కృషి చేయాలని ఆయన నొక్కి చెప్పారు. "స్వార్థ ప్రయోజనాలను కలిగి ఉన్నవారు విచారణలను అడ్డుకోవడానికి, ఈ సంస్థలతో సంబంధం ఉన్న వ్యక్తుల పరువు తీసేందుకు ప్రయత్నిస్తారు. కానీ జనతా జనార్దన్ భగవంతుని రూపం, వారు సత్యాన్ని తెలుసుకుంటారు, పరీక్షిస్తారు, సమయం వచ్చినప్పుడు, వారు సత్యానికి మద్దతు ఇచ్చే వారితో నిలబడతారు.", అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ విధులను అంకితభావంతో నెరవేర్చేందుకు సత్య మార్గంలో నడవాలని, "మీరు దృఢ నిశ్చయంతో చర్య తీసుకున్నప్పుడు, దేశం మొత్తం మీకు అండగా నిలుస్తుంది" అని ఆయన నొక్కిచెప్పారు.

ప్రధానమంత్రి తమ ప్రసంగాన్ని ముగిస్తూ, బాధ్యత చాలా పెద్దదని, సవాళ్లు కూడా మారుతూనే ఉంటాయని, పేర్కొన్నారు. "అమృత్ కాల్ సమయంలో పారదర్శకమైన, పోటీతత్వ పర్యావరణ వ్యవస్థను నిర్మించడంలో మీరు కీలక పాత్ర పోషిస్తారని నేను ఖచ్చితంగా విశ్వసిస్తున్నాను", అని ప్రధానమంత్రి అన్నారు. ఈ సవాలును పరిష్కరించే పద్ధతిలో స్థిరమైన చైతన్యం అవసరమని ఆయన నొక్కి చెప్పారు. వ్యాసరచన పోటీ విజేతలతో సంభాషించడం పట్ల ప్రధానమంత్రి సంతోషం వ్యక్తం చేశారు, భవిష్యత్తులో వక్తృత్వ పోటీని ప్రవేశపెట్టాలని సూచించారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాటం అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో బహుమతులు గెలుచుకున్న ఐదు మంది విజేతలలో నలుగురు బాలికలేనని గమనించిన ప్రధానమంత్రి, ఈ ప్రయాణంలో అబ్బాయిలు కవచం ధరించి, కలిసి ర్యాలీగా రావాలని కోరారు. "మురికిని తొలగించినప్పుడే పరిశుభ్రత యొక్క ప్రాముఖ్యత అర్థమవుతుంది'' అని ఆయన వ్యాఖ్యానించారు. "చట్టం పరిధికి వెలుపల పని చేసేవారిని గుర్తించే విషయంలో సాంకేతికత ఖచ్చితంగా 'పేపర్ ట్రయిల్ ను వదిలివేస్తుంది", అని గమనించిన ప్రధానమంత్రి, అవినీతికి వ్యతిరేకంగా ఈ పోరాటంలో సాంకేతికతను వీలైనంత ఎక్కువగా ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు.

ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి, డా. పి.కె. మిశ్రా; సిబ్బంది, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి డా. జితేంద్ర సింగ్; కేబినెట్ కార్యదర్శి, కేంద్ర విజిలెన్స్ కమిషనర్ శ్రీ సురేష్ ఎన్. పటేల్; విజిలెన్స్ కమిషనర్లు శ్రీ పి.కె. శ్రీవాస్తవ, శ్రీ అరవింద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పౌరులకు వారి ఫిర్యాదుల పురోగతి గురించి ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందించడం కోసం ఈ పోర్టల్ ను రూపొందించడం జరిగింది. "నైతికత మరియు మంచి పద్ధతులు" పై చిత్రాలతో కూడిన చిన్న చిన్న పుస్తకాలను, ప్రివెంటివ్ విజిలెన్స్"పై ఉత్తమ అభ్యాసాల సంకలనంతో పాటు, పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ పై ఒక ప్రత్యేక సంచిక "విజె-వాణి" లను కూడా ప్రధానమంత్రి ఈ సందర్భంగా విడుదల చేశారు. జీవితంలోని అన్ని రంగాలలో సమగ్రత సందేశాన్ని వ్యాప్తి చేయడంలో భాగస్వాములందరినీ ఒకచోట చేర్చడం కోసం సి.వి.సి. ప్రతి సంవత్సరం ఈ నిఘా అవగాహన వారోత్సవాలను పాటిస్తుంది. "అభివృద్ధి చెందిన దేశానికి అవినీతి రహిత భారతదేశం" అనే ఇతివృత్తంతో ఈ ఏడాది అక్టోబర్, 31వ తేదీ నుంచి నవంబర్, 6వ తేదీ వరకు దీనిని పాటిస్తున్నారు. నిఘా అవగాహన వారోత్సవాలలో భాగంగా ఇదే ఇతివృత్తంపై సి.వి.సి. దేశవ్యాప్తంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో ఉత్తమ వ్యాసాలు రాసిన ఐదుగురు విద్యార్థులకు ప్రధానమంత్రి బహుమతులు ప్రదానం చేశారు.

## అమెరికా అధ్యక్షుడిగా మళ్లీ పోటీ చేస్తాను కావొచ్చు: డొనాల్డ్ ట్రంప్

న్యూఢిల్లీ, నవంబర్ 4:అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2024 అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉంది. ఇదే విషయాన్ని ట్రంప్ ముగ్గురు సలహాదారులు కూడా నిజమని నిర్ధారిస్తున్నారు. అమెరికాలో వచ్చేవారం మధ్యంతర ఎన్నికలు జరగనున్నాయి. ఈ సందర్భంగా రిపబ్లికన్ పార్టీ నిర్వహించిన ఒక ర్యాలీలో పాల్గొన్నారు డొనాల్డ్ ట్రంప్. 'మనదేశాన్ని బలీయమైన శక్తిగా, సురక్షితంగా, విజయమంతమైన దేశంగా మార్చేందుకు నేను బహుశా మళ్లీ అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయొచ్చు. ఏడాది మనం మళ్లీ వైట్‌హౌస్‌లో అడుగుపెట్టబోతున్నాం. సెనేట్‌గా గెలవబోతున్నాం 2024 ఎన్నికల్లో అమెరికాలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. అందుకు అందరూ సిద్ధంగా ఉండండి' అని అక్కడి జనాన్ని ఉద్దేశించి ఉత్తేజంగా ప్రసంగించారు ట్రంప్.

వ్యాపారవేత్త నుంచి అధ్యక్షుడిగాబరాక్ ఒబామా తర్వాత 2016లో అమెరికా అధ్యక్షుడిగా వైట్‌హౌస్‌లో అడుగుపెట్టారు డొనాల్డ్ ట్రంప్. పెద్ద వ్యాపారవేత్త అయిన ట్రంప్ రిపబ్లికన్ పార్టీ తరఫున ఎన్నికల్లో బరిలోకి దిగి, డెమోక్రాటిక్ అభ్యర్థి హిల్లరీ క్లింటన్‌ని ఓడించారు. ఈమె అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ భార్య. ట్రంప్ తన పదవీకాలం తర్వాత మళ్లీ అధ్యక్షుడిగా పోటీ చేయాలనుకున్నారు. అంతేకాదు, వైట్‌హౌస్‌ను ఖాళీ చేయకపోవడం, అధికార మార్పిడికి సహకరించకపోవడం వంటి చర్యలతో వార్తల్లో నిలిచారు ట్రంప్. ప్రస్తుతం అమెరికా ప్రెసిడెంట్‌గా ఉన్న డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి జో బిడెన్ పదవీకాలం 2024లో ముగుస్తుంది.

## నూతన మెడికల్ కళాశాలను పరిశీలించిన ఎమ్మెల్యే



మహబూబాబాద్, నవంబర్ 4:(నేటినిజం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో త్వరలో తరగతులు ప్రారంభం కానున్న నూతన మెడికల్ కళాశాలను మహబూబాబాద్ శాసనసభ్యులు బానోత్ శంకర్ నాయక్ సందర్శించి కళాశాలలో జరుగుతున్న అడ్మిషన్లను పరిశీలించారు. ప్రిన్సిపాల్ తో కలిసి అడ్మిషన్ సంబంధించిన వివరాలను తెలుసుకుని మెడికల్ కళాశాలలో సీటు సంపాదించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

వీరితోపాటు మున్సిపల్ చైర్మన్ డా.రామ్మోహన్ రెడ్డి , ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు , హెచ్ఓడి డా.సీతామహాలక్ష్మి , కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు



ఖమ్మం, నవంబర్ 4: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నగరంలో పలు డివిజన్ లలో రూ. 2.25 కోట్లతో నిర్మించనున్న సీసీ సైడ్ డ్రైన్స్ నిర్మాణ పనులకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు.

ఖమ్మం నగరంలోని 2వ డివిజన్ బల్లేపల్లి లో 45 లక్షలు, 4వ డివిజన్ బల్లేపల్లి స్టేజ్ నందు 45 లక్షలు, 9వ డివిజన్ శ్రీశ్రీ సర్కిల్ లో 45 లక్షలు, 13వ డివిజన్ శ్రీ నగర్ కాలనీలో 45 లక్షలు, 11వ డివిజన్ కవిరాజ్ నగర్ లో 45 లక్షలు, మొత్తం రూ. 2.25 కోట్లతో నిర్మించనున్న సీసీ సైడ్ డ్రైన్స్ నిర్మాణ పనులకు మంత్రి పువ్వాడ శంకుస్థాపనలు చేశారు.

కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, కార్పొరేటర్లు దండా జ్యోతి రెడ్డి, ఎస్కే జాన్ బీ, సరిపుడి రమాదేవి, కొత్తపల్లి నీరజ, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, డిఈ లు స్వరూప రాణి, నవ్య జ్యోతి, రంగారావు, సిబ్బంది, డివిజన్ నాయకులు ఉన్నారు.

## ద్వైపాక్షిక రక్షణ సహకారం పెంచుకోవడానికి న్యూఢిల్లీలో సమావేశమైన భారత రక్షణ శాఖ కార్యదర్శి & రాయల్ భూటాన్ ఆర్మీ చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్

న్యూఢిల్లీ, నవంబర్ 4:రాయల్ భూటాన్ ఆర్మీలో చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ (సీవోవో, ఆర్‌బీఏ) లెఫ్టినెంట్ జనరల్ బటూ షెరింగ్, భారత రక్షణ శాఖ కార్యదర్శి శ్రీ గిరిధర్ అరమణేతో న్యూఢిల్లీలో సమావేశం అయ్యారు. లెఫ్టినెంట్ జనరల్ బటూ షెరింగ్ భారత పర్యటన సందర్భంగా నవంబర్ 01, 2022న ఈ సమావేశం జరిగింది. రెండు దేశాల సైన్యాల మధ్య కొనసాగుతున్న రక్షణ సహకారంపై ఇరువురు చర్చించారు. రక్షణ సహకారాన్ని పెంచడానికి పరస్పర ఆసక్తి ఉన్న అంశాలను సమీక్షించారు.

ఆర్‌బీఏ సీవోవోగా 17 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందుకు లెఫ్టినెంట్ జనరల్ బటూ షెరింగ్‌ను రక్షణ కార్యదర్శి అభినందించారు. భారతీయ సైనిక శిక్షణ బృందంతో సానుకూల బంధంపై లెఫ్టినెంట్ జనరల్ బటూ షెరింగ్ సంతోషం వ్యక్తం చేశారు. భూటాన్ రక్షణ కోసం భారతీయ సైనిక శిక్షణ బృందం 1962 నుంచి అందిస్తున్న సహకారాన్ని గుర్తు చేసుకున్నారు.

భూటాన్ రాజు శ్రీ జిగ్మే ఖేసర్ నామ్ గ్యాల్ వాంగ్ చుక్ ప్రారంభించిన జాతీయ సేవ కార్యక్రమాన్ని (గ్యాల్‌సంగ్) శ్రీ గిరిధర్ అరమణే ప్రశంసించారు. యువత నైపుణ్యాభివృద్ధి కోసం భారత్-భూటాన్ సహకరించుకోగల అవకాశాలపై ఆయన చర్చించారు.

చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో పాసింగ్ ఔట్ పరేడ్‌కు హాజరైనందుకు లెఫ్టినెంట్ జనరల్ బటూ షెరింగ్‌కు ధన్యవాదాలు తెలిపారు. భారత్, భూటాన్ మధ్య బలమైన స్నేహబంధాన్ని కొనసాగించేందుకు భారత రక్షణ శాఖ కార్యదర్శి, ఆర్‌బీఏ సీవోవో పరస్పరం అంగీకరించారు. బంధుత్వం, స్నేహాన్ని కొనసాగించడానికి ఇరుపక్షాల నిబద్ధతను బలంగా వెల్లడించారు.

## దైవసేవకుల సమావేశంలో పాల్గొన్న జలగం జాషువ

మహబూబాబాద్, నవంబర్ 4:(నేటినిజం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన దైవ సేవకుల సదస్సులో పెద్దవంగర మండల జలగం జాషువా మాట్లాడుతూ ఐక్యత కలిగి ఉండడం ఎంతో గొప్ప బలమని దైవ సేవకులు అందరూ ఐక్యంగా ఉండి క్రీస్తు మార్గంలో శాంతిని ప్రకటిస్తూ ప్రజలను సన్మార్గములో నడిపించాలని దైవ సేవకులు అందరూ సమాజ సేవను అవలంబించుకోవాలని కష్టాల్లో ఉన్నవారికి మన సాధ్యమైనంత సహాయము చేయాలని సలహా ఇచ్చారు . ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో క్రైస్తవులు ముందుండాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా ఎం డి పి ఎల్ ఎఫ్ అధ్యక్షులు మల్లెపాక తిమోతి, నంగునూరి కాలేబు ,జితేందర్ రెడ్డి ,ఇంటర్నేషనల్ గ్లోబల్ పీస్ చైర్మన్ బాలు నాయక్,18 మండలాల దైవ సేవకులు తదితరులు పాల్గొన్నారు.

